

అభివృద్ధి దిశగా అడుగులు

తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

రాజకీయమంటే దబాయింపు. రాజకీయమంటేనే దౌర్జన్యం. పోలీసు సహా సకల అధికార యంత్రాంగాల పగ్గాలు చేతబట్టి ఆడే వికృత క్రీడే రాజకీయం.. అనేంతగా అయిదేళ్లు తిరుపతి నగరం మకిలిపట్టిపోయింది. కబ్జాలు, గంజాయి మురాలు, పండ్ల బండ్ల ముందూ చేతులు చాచే చిల్లర నాయకుల అరాచకాలతో వేగిపోయిన తిరుపతి ప్రజలు కూటమి విజయంతో ఏడాదిగా ఊపిరి పీల్చుకుంటున్నారు. పూర్వపు ప్రశాంతతను తిరుపతి నగరం అనుభవిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికలు తెచ్చిన మార్పు ఇది. జనసేన అభ్యర్థిగా బరిలోకి దిగిన ఆరణి శ్రీనివాసులు జిల్లాలోనే అత్యధిక ఓట్ల మెజారిటీతో తిరుపతి ఎమ్మెల్యేగా గెలిచారు. స్థానికేతరుడు, వైసీపీ నుంచి వచ్చిన నాయకుడు అంటూ వ్యాపించిన అనుమానపు నీడలు ఈ ఏడాదిలో పటాపంచలయ్యాయి. ఆయన నిరంతరం నగరంలో జనం మధ్య తిరుగుతూ కనిపిస్తున్నారు. కూటమి పార్టీల్లోని చిరచిరలనూ దూకుడుతో గాక, నెమ్మదితనంతో అధిగమిస్తున్నారు. దబాయింపు స్థానంలో ప్లీజింగ్ రాజకీయాలను తిరుపతికి ఆయన పరిచయం చేస్తున్నారు. ఎన్నికలకు ముందూ, గెలిచిన తర్వాతా తిరుపతి అభివృద్ధికి ఎన్నో హామీలు ఇచ్చిన ఆరణి శ్రీనివాసులు ఈ ఏడాది కాలంలో సాధించినవేమిటి? తిరుపతి నియోజకవర్గంలోని ప్రజలు ఎమ్మెల్యేగా ఆయన నుంచి ఏం కోరుతున్నారు? రెండో ఏడాది లక్ష్యంగా ఏ అంశాలను నిర్దేశించుకున్నారు... తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఏడాది పాలనపై ప్రోగ్రెస్ రిపోర్ట్....

- 8వ పేజీలో



10న మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 5(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఈ నెల 10వ తేదీన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తున్నామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలల్లో ఈ కార్య క్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య పరస్పర అవగాహన కోసమే ఈ కార్యక్రమం చేపడుతున్నామని వివరించారు. విద్యార్థులకు హోలీస్టిక్ ప్రోగ్రెస్ రిపోర్టులు ఇవ్వనున్నట్లు తెలిపారు. తల్లి పేరుతో విద్యార్థుల చేత మొక్కలు నాటిస్తామని వెల్లడించారు. ఆధార్ అప్‌డేట్ కాని వారికి ఈ నెల 10వ తేదీన తల్లికి వందనం కింద నగదు జమ చేస్తామన్నారు. పాఠశాలల విలీనానికి సంబంధించి మాట్లాడుతూ గత ఏడాది రేషనలైజేషన్ పద్ధతిన 534 పాఠశాలలను విలీనం చేశామని, ప్రతి పంచాయతీలో ఒక మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఎక్కడా పాఠశాలలను మూసివేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐవో రాజశేఖర్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

మహానగరికి అడుగులు

గ్రేటర్ తిరుపతి దిశగా ప్రతిపాదనలు

- చంద్రగిరి, విమానాశ్రయం వరకు విస్తరణ
- సీఎం ప్రత్యేక చొరవ
- ప్రణాళికలకు సిద్ధమవుతున్న యంత్రాంగం



తిరుపతి- ఆంధ్రజ్యోతి

గ్రేటర్ తిరుపతి. 15 ఏళ్లుగా ఈ పేరు వింటూనే ఉన్నాం. 2007లో తిరుపతి మున్సిపాల్టీ నుంచి నగరపాలక సంస్థ (కార్పొరేషన్)గా అవతరించినప్పుడు గ్రేటర్‌పై వార్తలు వినిపించాయి. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రేటర్ అంశం మరోసారి తెరపైకి వచ్చినప్పటికీ సాధ్యపడలేదు. ఈసారి అలాకాదు. తిరుపతిని గ్రేటర్ చేసేందుకు చంద్రబాబు పట్టుబట్టి కూర్చున్నారు. ఆ దిశగా అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తున్నారు. దాదాపు 5 లక్షల జనాభా ఉన్న తిరుపతి పరిధిని 10లక్షల వరకు పెంచి గ్రేటర్‌గా మార్చాలని చెబుతున్నట్లు తెలిసింది. అయితే 10 లక్షల జనాభా అంటే పరిధి మరీ ఎక్కువవుతుందని, అధికారుల పర్యవేక్షణ కష్టమవుతుందన్న ఆలోచన కూడా ఉంది. దీంతో 7లక్షల జనాభాతో గ్రేటర్ ప్రతిపాదనలు తయారు చేసేందుకు అధి కా ం యంత్రాంగం కసరత్తు మొదలుపెట్టనుంది. తిరుపతి నుంచి పడమర వైపు చంద్రగిరి వరకు, తూర్పు వైపు రేణిగుంట విమానాశ్రయం (మంగళం, కరకంబాడి తదితర ప్రాంతాలతో) వరకు గ్రేటర్ పరిధిలోకి తీసుకురానున్నారు.

> "తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధి చాలా తక్కువ. పరిధి పెంచకపోతే అభివృద్ధి సాధ్యం కాదు. కార్పొరేషన్ పరిధి పెంచేలా నివేదిక ఇస్తాం. ఇటీవల తిరుపతి పర్యటనకు వచ్చిన పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్ మీడియాతో చెప్పిన మాట. కలెక్టర్ వెంకటేశ్వర్, నగర కమిషనర్ మౌర్య ఇతర అధికార యంత్రాంగంతో తిరుపతి కార్పొరేషన్‌పై కమిటీ సమీక్షించింది. అందులో గ్రేటర్ తిరుపతిపై సీఎం చంద్రబాబు సుముఖంగా ఉన్నారని, అందుకు సంబంధించిన కసరత్తు మొదలవుతుందని చర్చించినట్టు తెలిసింది."

తిరుపతి పురపాలక నేపథ్యం

1886 ఏప్రిల్ 4న తిరుపతి మున్సిపాలిటీ ఏర్పాటైంది. 2007 మార్చి 3న నగరపాలక సంస్థగా అవతరించింది. 2013 జూలై 25న ఎమ్మార్‌పల్లె, రాజీవ్‌నగర్, తిమ్మినాయుడుపాళెం పంచాయతీలను కలుపుకుని విస్తరించింది. రెండేళ్ల క్రితం శెట్టిపల్లి విలీనమైంది. శెట్టిపల్లి మినహా 50 డివిజన్లను తిరుపతి కార్పొరేషన్ కలిగి ఉంది. గ్రేటర్ అయితే మరో 30 డివిజన్ల వరకు వచ్చే అవకాశముంది.

సీఎం పర్సనల్ ఇంట్రెస్ట్

మౌర్య, నగర కమిషనర్

వైజాగ్, విజయవాడ తరహాలో తిరుపతిని అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు వ్యక్తిగతంగా శ్రద్ధ చూపుతున్నారని నగర కమిషనర్ మౌర్య అన్నారు. ఇటీవల జరిగిన పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సమావేశంలో తిరుపతి విస్తరణ అంశం తెరపైకి రావడంతో 'ఆంధ్రజ్యోతి' కమిషనర్‌ను ఆరా తీసింది. తిరుపతి నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలంటే స్థలం సరిపోదు. భవిష్యత్తు అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే పట్టణీకరణ అయిన ప్రాంతాలను కలుపుకుని గ్రేటర్ తిరుపతిగా మార్చే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. మరో రెండేళ్లలో తిరుపతి గ్రేటర్ కాబోతోందని ఆమె స్పష్టం చేశారు.

రేపటి నుంచి ఏపీ ఈఏపీ సెట్ కౌన్సెలింగ్

- 18 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు
- పాలిటెక్నిక్‌లో హెల్ప్‌లైన్ సెంటర్

తిరుపతి(విద్య), జూలై 5(ఆంధ్రజ్యోతి): ఇంజినీరింగ్, అగికల్చర్, ఫార్మశీ కోర్సుల్లో ప్రవేశాలకు(ఈఏపీసెట్) సోమవారం నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. 16వ తేదీ లోపల ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. 17 వరకు దరఖాస్తుల వెరిఫికేషన్ జరుగనుంది. 10 నుంచి 18వ తేదీ ఆన్‌లైన్‌లో ఆప్షన్లు ఎంపిక చేసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. మార్పులుంటే 19న మార్చుకునే వీలుంది. 22న సీట్లు కేటాయిస్తారు.

ఈ జాగ్రత్తలు అవసరం

వెబ్ ఆప్షన్ల నమోదులో జాగ్రత్తగా వ్యవహరించాలి. నచ్చిన కోర్సులు, కళాశాలలను ముందుగానే ప్రాధాన్యతా క్రమంలో జాబితాను సిద్ధం చేసుకోవాలి. దాని ఆధారంగా ఆప్షన్లు నమోదు చేయాలి. విద్యార్థుల సౌకర్యార్థం స్థానిక ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అనుమానాల నివృత్తికి జిల్లా హెల్ప్‌లైన్ సెంటర్‌లో నేరుగా గాని, 94925 26080లో గాని సంప్రదించవచ్చు.

కోడ్‌ల అంశంలో జాగ్రత్త

పలు ఇంజినీరింగ్ కళాశాలల షార్ట్‌ఫాంలు వేరే ఇతర కళాశాలల పేర్లవలే ఉంది. కోరుకున్న కళాశాలలకు కాకుండా మరో కళాశాలకు ఆప్షన్ నమోదయ్యే ప్రమాదముంది. ఉదాహరణకు వేలూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కోడ్ వీఐటీ ఏపీ కాగా... వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల కోడ్ వీవీఐటీగా విట్‌ను తలపింపజేస్తుంది. ఇలాంటి వాటి విషయాల్లో జాగ్రత్తగా ఉండాలి.

అప్‌లోడ్ చేయాల్సిన సర్టిఫికెట్లు

ఈఏపీ సెట్ ర్యాంకు కార్డు, హాల్‌టికెట్, టెన్త్, ఇంటర్ ఇంటర్ మార్కుల లిస్టులు, ఆరవ తరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రిజర్వేషన్ ఆధారిత సర్టిఫికెట్, ఏడు సంవత్సరాల రెసిడెన్స్ సర్టిఫికెట్.


సమావేశంలో మాట్లాడుతున్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

ఐఐటీలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

- నిర్మాణ రంగంలో అభివృద్ధికి దోహదపడే అంశాలపై చర్చ
- 12 దేశాల నుంచి 550 మంది ప్రతినిధుల హాజరు

ఏర్పేడు, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఐఐటీ ప్రాంగణంలో ఐసీసీఎంఎస్(ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ కన్‌స్ట్రక్షన్ మెటీరియల్స్ అండ్ స్ట్రక్చర్స్) ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. నిర్మాణ రంగంలో స్థిరత్వం, దోహదపడే అంశాలపై చర్చించారు. 12 దేశాల నుంచి 550మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. సమగ్ర నిర్మాణాలు - పదార్థాల సమన్వయం(సినర్జీ ఆఫ్ మెటీరియల్స్ అండ్ స్ట్రక్చర్స్) అనే అంశంపై జరిగిన ఈ సదస్సులో 10 ప్లీనరీ ఉపన్యాసాలు, 21 కీలక ప్రసంగాలు, 427 సాంకేతిక పత్రాల ప్రదర్శనలు, 113 పోస్టర్ సెషన్లు నిర్వహించారు. తక్కువ కార్బన్ సిమెంటు, డిజిటల్ కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ, నిర్మాణ ఆరోగ్య నిఘా వంటి ప్రధాన అంశాలపై చర్చ జరిగింది. ముగింపు సమావేశంలో ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ ప్రసంగించారు. ఉత్తమ పత్రాలకు అవార్డులు అందజేశారు. సదస్సు నిర్వాహకురాలు ప్రొఫెసర్ బిజిలీ బాలకృష్ణన్ ఈ సదస్సు ద్వారా స్థిరమైన ఘన నిర్మాణ పదార్థాల అవసరం, డిజిటల్ ఫ్యాబ్రికేషన్ ప్రాముఖ్యం, విధాన రూపకల్పనలో సెక్టార్ల మధ్య సహకారం, యువ పరిశోధకుల పాత్ర వంటి నాలుగు కీలక విషయాలు స్పష్టమయ్యాయని తెలిపారు. జేఎస్‌డబ్ల్యూ, రామ్‌కో సిమెంట్స్, సికా, లారన్స్ అండ్ టూబ్రో వంటి ప్రాయోజక సంస్థలు ఈ కార్యక్రమ నిర్వహణలో సహకరించాయన్నారు. ముగింపు సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

ఎస్వీయూ దూరవిద్యా కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల

- ఈనెల 7 నుంచి ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ దూరవిద్యా కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 7వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎంఏ (తెలుగు, ఇంగ్లిష, ఎకనమిక్స్, హిస్టరీ, సోషియాలజీ, సోషియల్ వర్క్), ఎమ్మెస్సీ (ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బోటనీ, మ్యాథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్), ఎంకాం (ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్), ఎంఎల్ఐఎస్‌సీ (లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్), ఎంబీఏ (బిజినెస్ అడ్మినిస్ట్రేషన్), డిప్లొమో (ఇండస్ట్రియల్ రిలేషన్స్ అండ్ పర్సనల్ మేనేజ్‌మెంట్, గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్) కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్వీయూసీడీవోఈ.ఏసీ.ఇన్.. వెబ్‌సైట్ చూడవచ్చునని ఎస్వీయూ దూరవిద్యా డైరెక్టర్ ఊకా రమేష్‌బాబు తెలిపారు.

రేషన్‌కార్డుల్లో మార్పుచేర్పులకు 55,095 దరఖాస్తులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్తగా రేషన్ కార్డుల కోసం వేలాది దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఎక్కువ భాగం పేర్లు చేర్చడానికి వచ్చినవే ఉన్నాయి. కొత్తగా వివాహమైన మహిళలు, పుట్టిన పిల్లలను చేర్పించాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొత్త కార్డులు జారీ చేయకుండా, కుటుంబ సభ్యులను చేర్చాలని కోరినా పట్టించుకోకుండా కాలం వెళ్లదీసిన విషయం విదితమే. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అర్హులైన వారు దరఖాస్తు చేసుకునేందుకు, మార్పులు, చేర్పులు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా 55,095 దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిశీలించిన అధికారులు 25,044 దరఖాస్తులు అర్హమైనవిగా గుర్తించారు.

వచ్చిన దరఖాస్తుల వివరాలు

- రేషన్ కార్డుల్లో అడ్రస్‌ల మార్పు: 2,486
- ఆధార్ సీడింగ్ సవరణ కోసం: 654
- చౌకదుకాణాల రెన్యూవల్ కోసం: 4
- రేషన్ కార్డుల్లో పేర్లు చేర్చడానికి : 38,727
- పేర్లు తొలగించడానికి: 1,354
- కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసిన వారు: 7,258
- కార్డుల విభజన కోసం వచ్చినవి: 4,577
- ప్రభుత్వానికి సరెండర్ చేసిన కార్డులు: 35


ఇరు పార్టీలతో మాట్లాడి రాజీ కుదుర్చుతున్న జడ్జిలు

లోక్ అదాలత్‌లో 2,208 కేసుల పరిష్కారం

తిరుపతి(నేరవిభాగం), జూలై 5(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తులు కోరారు. తిరుపతి కోర్టు ప్రాంగణంలో శనివారం మూడవ అదనపు జిల్లా జడ్జి గురునాథ్, ఐదవ అదనపు ఫ్యామిలీ కోర్టు జడ్జి రాంగోపాల్ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. వివిధ కేసులకు సంబంధించి ఇటు కక్షిదారులు, అటు ఫిర్యాదుదారుల మధ్య రాజీ కుదిర్చి శాంతియుతంగా కేసులు పరిష్కారం చేశారు. జాతీయ లోక్ అదాలత్ కోసం కోర్టు ఆవరణలో ఎనిమిది బెంచీలు ఏర్పాటు చేశారు. ప్రతి బెంచ్‌కు ఒక జడ్జిని నియమించారు. ఇందులో సివిల్, క్రిమినల్, వివాహ సంబంధ తగాదాల్లో ఉన్న కేసులు, మోటరు వాహనాల పరిధిలో వున్న కేసులు పరిష్కారమయ్యాయి.

5,098 కేసుల పరిష్కారం

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 5,098 కేసులు పరిష్కారమయ్యాయి. పీఎల్‌సీఎస్ 140తోపాటు వాయల్పాడులో 41, తిరుపతిలో 2208, తంబళ్లపల్లెలో 96, శ్రీకాళహస్తిలో 267, సత్యవేడులో 188, పుత్తూరులో 34, పుంగనూరులో 60, పీలేరులో 69, పలమనేరులో 202, పాకాలలో 132, నగరిలో 102, మదనపల్లెలో 44, కుప్పంలో 62, చిత్తూరులో 1453 కేసులు పరిష్కారమయ్యాయి.

రేపటి నుంచి ఈసెట్ వెబ్ ఆప్షన్ల నమోదు

తిరుపతి(విద్య), జూలై 5(ఆంధ్రజ్యోతి): డిప్లొమా ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ విద్యార్థులు బీటెక్, బీఫార్మా కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ఈసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ 7వ తేదీ నుంచి ప్రారంభం కానుందని తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ వై.ద్వారకానాథరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి విద్యార్థులు తమకు ఇష్టమైన కళాశాలలు, కోర్సులను వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

రూ.50 లక్షల బంగారం చోరీ

- రూ.3లక్షల నగదు కూడా..
- నాయుడుపేట మార్కెట్ సెంటర్‌లో ఘటన

నాయుడుపేట టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మార్కెట్ సెంటర్ సమీపంలోని ఓ ఇంట్లో పట్టపగలే భారీ చోరీ జరిగింది. సుమారు రూ.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. బాధితుల కథనం మేరకు.. మార్కెట్ సెంటర్ సమీపంలో నివసిస్తున్న గంగినేని హరీంద్రనాయుడు-సునీత దంపతులు శనివారం ఉదయం 10 గంటలకు ఇంటికి తాళాలు వేసుకుని గూడూరులో జరిగే ఓ శుభకార్యానికి వెళ్లారు. రాత్రి 8 గంటల సమయంలో తిరిగి ఇంటికి వచ్చారు. తాళాలు పగిలిపోయి ఉండడాన్ని గుర్తించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని 55 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షల నగదు, మరికొన్ని వెండి వస్తువులు కనిపించలేదు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హరీంద్రనాయుడు కుటుంబానికి సన్నిహితంగా ఉండే వెంకటాద్రి-సునీత దంపతులు 25 సవర్ల నగలు, 2.50 లక్షల నగదును హరీంద్రనాయుడు ఇంట్లో దాచి ఉంచాలని ఇచ్చి ఉన్నారు. ఈ క్రమంలో మొత్తం చోరీ జరిగింది. చోరీ జరిగిన ఇంటిని డీఎస్పీ చెంచుబాబు, అర్బన్ సీఐ బాబీ పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకున్నారు.


చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ చెంచుబాబు

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న దర్శనం



చంద్రగిరి, జూలై 5(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేతుడై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యకట్ల కైంకర్యాల య్యాక శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను కల్యాణ మండపంలో కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను విశేషంగా అలంకరించి, బంగారు తిరుచ్చి వాహనంపై అధిష్ఠించారు. స్వామి ఆలయ మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమాలలో ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్‌రెడ్డి, ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, జమేదర్ చిరంజీవి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

తుమ్మలగుంటలో ఇంటింటికీ టీడీపీ శ్రేణులు



కరపత్రం అందజేత

తిరుపతిరూరల్, జూలై5(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగారు. ఏడాదిలో ఎమ్మెల్యే పులివర్తినానీ చొరవతో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. సూపర్‌సిక్స్‌లో భాగంగా ఇప్పటికే అమలు చేసిన పింఛన్ పెంపు, దీపం పథకం, తల్లికివందనం, ఉద్యోగాల కల్పన తదితర కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానిక సమస్యలని అడిగి తెలుసుకున్నారు. టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు పార్లపల్లి భరత్‌కుమార్‌రెడ్డి, బూత్ కన్వీనర్ బిరుదాల సిద్దారెడ్డి నేతృత్వంలో స్థానిక నేతలు రాధారాయల్, చెంగల్రామానాయుడు, గురవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 77 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి పూర్ణిమదేవి

పాకాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పాకాల కోర్టు ఆవరణలో శనివారం జూనియర్ సివిల్ జడ్జి పి.పూర్ణిమదేవి అధ్యక్షతన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో క్రిమినల్, సివిల్, పెట్టీ కేసులు, బ్యాంక్‌లకు సంబంధించి 77 కేసులు పరిష్కారమయ్యాయి. రూ.1,24,79,075కు సంబంధించి వివాదాలు పరిష్కారమయ్యాయి. లోక్ అదాలత్ సభ్యుడు జి.చంద్రమోహన్, న్యాయవాదులు జి.గురుస్వామినాయుడు, డి.సుబ్రమణ్యం రెడ్డి, బిసి రెడ్డప్పనాయుడు, జెఎం గౌరీశంకర రాజు, ఎన్.మదుసూదన్ రెడ్డి, సునీల్, పోలీసు అధికారులు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రకాష్

పాకాల, 5 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకుడు ప్రకాష్ కోరారు. ఈ నెల 9న జరిగే సమ్మెకు సంబంధించి కరపత్రాలను ఆయన కార్మిక సంఘాల నాయకులతో కలిసి శనివారం ఆవిష్కరించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలన్నారు., 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చడం దారుణమన్నారు. విద్యుత్ చార్జీల బకాయిలంటూ వినియోగదారుల నుండి అధిక చార్జీలు వసూలు చేయడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివ, పురుషోత్తం, ఖాదర్ వల్లీ, కేశవయ్య, రాజ, మోహన్, అన్నయ్య, ధనుంజయ, నానీ, ప్రమీళ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తొందరపడి మామిడి చెట్లను నరుక్కోవద్దు



రైతులకు సూచనలు ఇస్తున్న వీరయ్య చౌదరి

రామచంద్రాపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): మామిడిచెట్లను తొందరపడి నరకవద్దని కేంద్రీయ సస్యరక్షణ అధికారి వీరయ్య చౌదరి రైతులకు సూచించారు. గంగిరెడ్డిపల్లి, రామాపురం, కమ్మకండ్రిగ,నడవలూరు గ్రామాల్లో ఇటీవల నరికిన మామిడితోటలను ఉద్యాన శాఖాధికారులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కోసిన తరువాత సూర్యరశ్మి పడేలా కొమ్మలను కత్తిరించాలని,. తరువాత లీటరు నీటిలో మూడు గ్రాముల ఫ్లోరైడ్‌కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఉద్యానశాఖాధికారి శివకుమారి, సహాయకులు పూజిత, రైతులు దొరస్వామినాయుడు, హరినాథరెడ్డి, జయరామనాయుడు పాల్గొన్నారు.

ముగిసిన వారాహి నవరాత్రులు



పూర్ణాహుతి సమర్పిస్తున్న రమ్యానంద భారతి

రామచంద్రాపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): శక్తిపీఠంలోతొమ్మిదిరోజులపాటు నిర్వహించిన వారాహి నవరాత్రులు పూర్ణాహుతితో ముగిశాయి, శనివారం మరకతశక్తికాళీ, ప్రత్యంగిరా, వారాహిదేవిలకు తిరుమంజనంనిర్వహించారు. వేద పండితులు శాస్త్రోక్తంగా వారాహి హోమాన్ని ప్రారంభించగా మధ్యాహ్నం శక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతి పూర్ణాహుతితో ముగించారు. భక్తులు పుష్పార్చన నిర్వహించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

శిథిలావస్థకు పైకా భవనం



పాకాల, జూలై 5(ఆంధ్రజ్యోతి): పుష్కర కాలం క్రితం నిర్మించిన పంచాయతీ యువ క్రీడా, ఖేల్ అభియాన్ భవనం ప్రారంభించకనే శిథిలావస్థకు చేరుకుంది. మండల విద్యావనరుల కేంద్రం, భవిత కేంద్రం ఆవరణలో ఈ పైకా భవనాన్ని నిర్మించారు. గోడలు, శ్లాబు పూర్తయింది. కిటికీలు, తలుపులు అమర్చారు. పూతపని, ఫ్లోరింగ్ పనులు అసంపూర్తిగా నిలిచి పోయాయి. రాష్ట్ర విభజన తర్వాత టీడీపీ, ఆపై వైసీపీ ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో ఇది శిథిలావస్థలో వుంది. కొంత మొత్తం వెచ్చిస్తే ప్రభుత్వ కార్యాలయంగా వినియోగించుకోవచ్చు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

సేంద్రియ ఎరువులను వాడండి



రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారి

రామచంద్రాపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): రసాయినిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులనే వాడాలని వ్యవసాయశాఖాధికారి మమత సూచించారు. అనుపల్లెలో మాజీ ఎంపీపీ బిందుమాధవి అధ్యక్షతన శనివారం పొలంబడి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రైతులు ఖరీఫ్ సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను మమత వివరించారు. కార్యక్రమంలో వెంకటేష్‌నాయుడు, రమణారెడ్డి, విజయకుమార్‌రెడ్డి, అగ్రికల్చర్ రేణుక పాల్గొన్నారు.

బీఎన్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం



నివాళులు అర్పిస్తున్న దివాకర్‌రెడ్డి

రామచంద్రాపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక వేత్త, సమాజసేవకులు బీఎన్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని తుడా చైర్మన్‌దివాకర్‌రెడ్డి శ్లాఘించారు. రామాపురం బీఎన్‌రెడ్డి సమాధి వద్ద సంస్మరణ సభ శనివారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు బీఎన్‌రెడ్డి సేవలను స్మరించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కేశవులునాయుడు, నరసింహారెడ్డి, తిరుమలరెడ్డి, హరిప్రసాద్‌నాయుడు, జనార్దన్‌చౌదరి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



చాముండేశ్వరీనాథ్- సోనియా సింగ్

తిరుమల, జూలై5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ చాముండేశ్వరీనాథ్, నటి సోనియా సింగ్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఆక్రమణల తొలగింపు



తిరుచానూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం దామినేడులో సర్వే నెంబరు 196/11, 12, 13, 197/2, 5, 7లలో ప్రభుత్వ భూముల్లో కట్టిన ఏడు ఇళ్లను కూల్చివేసినట్లు ఆర్ఐ రఘువర్మ తెలిపారు. ప్రభుత్వ ఎవరైనా ఆక్రమించి ఎవరైనా అక్రమ కట్టడాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు.

పిల్లల పట్ల అప్రమత్తంగా వ్యవహరించండి



కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

తిరుచానూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): పిల్లలు మత్తుపదార్థాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని డీఎస్పీ ప్రసాద్, సీఐ సునీల్‌కుమార్ సూచించారు. తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌లో శనివారం యువతకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వారి తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడారు. గంజాయికి బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని యువతను హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల పండుగ



గాలివీధి పీర్లచావడిలో పీర్ల వద్ద ప్రార్థనలు చేస్తున్న భక్తులు

తిరుపతి(ఆటోనగర్), జూలై 5(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శనివారం పీర్ల పండుగను పురస్కరించుకుని హిందూ - ముస్లింలు భక్తిశ్రద్ధలతో పీర్లకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. నగరంలోని గాలివీధి, నిమ్మకాయలవీధి, పెద్దకాపువీధుల్లో వున్న పీర్ల చావళ్లల్లో తొమ్మిదోరోజు పెద్ద పీర్లకు పూజలు చేశారు. హిందువులు, ముస్లింలు తమ కోరికలు తీరిన సమయంలో ఈ పండుగ సమయంలో కొత్తపీరును చావడిలో పెట్టి పూజలు చేస్తారు. గతంలో మొక్కులు తీరిన భక్తులు వచ్చి పీర్లను పూలతో అలంకరించి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పానకం, పప్పులు, బెల్లం పంపిణీ చేశారు. వందలాది మంది హిందూ భక్తులు పీర్ల చావడికి వచ్చి సాంప్రదాయ పద్ధతుల్లో మొక్కులు చెల్లించుకున్నారు. గాలివీధి యూత్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. పాటకచేరి నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు అగ్నిగుండ ప్రవేశం జరిగింది. అనంతరం పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. పలువురు ప్రముఖులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఆరేళ్లుగా ప్రహరీ దాటని నిర్మాణ పనులు

పూర్తి కాని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవనం



ఎ.రంగంపేటలో అతీగతీ లేకుండా పడి ఉన్న భవన నిర్మాణం

చంద్రగిరి, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఎం.రంగంపేట పంచాయతీ పరిధిలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవన నిర్మాణం ప్రహరీ గోడకే పరిమితమైంది. గత టీడీపీ ప్రభుత్వంలో 2018-19లో యువత ఉపాధి, ఉద్యోగావకాశాల కల్పనకు ఈ సెంటర్ భవనం ఏర్పాటుకు మోహన్‌బాబు విశ్వవిద్యాలయం ఎదురుగా 9.30 ఎకరాలు కేటాయించింది. దీని చుట్టూ అప్పట్లోనే రూ.1.20 కోట్లతో ప్రహరీ గోడ నిర్మించారు. తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో భవన నిర్మాణం మరుగున పడింది. ఆ భూమిలో జగనన్న ఇంటి స్థలాలు కేటాయించడానికి గత ప్రభుత్వం ప్రయత్నించింది. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు కోర్టుకు వెళ్లడంతో ఇందుకు బ్రేకు పడింది. ఆభూమిలో ఎలాంటి ఇంటి పట్టాలు ఇవ్వరాదని కోర్టు తేల్చి చెప్పింది. ప్రహరీ నిర్మించి సుమారు ఆరేళ్ళు అవుతుండటంతో భూమిలో మొక్కలు పెరిగి చెట్లుగా మారాయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆభూమిలో స్కిల్ డెవలప్‌మెంట్ భవనం నిర్మాణం చేపడుతుందని నిరుద్యోగ యువత ఆశగా ఎదురు చూస్తున్నారు. దీనిని నిర్మిస్తే ఉపాధి ఉద్యోగావకాశాలకు శిక్షణ ఇచ్చేందుకు దోహదపడుతుంది. తమకు ఉద్యోగవకాశాలు లభిస్తాయని నిరుద్యోగులు భావిస్తున్నారు. ప్రజాప్రతినిధులు,అధికారులు చొరవ తీసుకుంటే ఇది సాకారమవుతుందని చెబుతున్నారు.

హామీలను నెరవేరుస్తున్నాం : టీడీపీ



కమ్మకండ్రిగలో ఇంటింటి ప్రచారం

రామచంద్రాపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చంద్రబాబునాయుడు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని టీడీపీ జిల్లా నేత జనార్దన్ చౌదరి అన్నారు. కమ్మకండ్రిగలో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అమలవుతుందన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి కార్యక్రమాలను వివరించారుర. యువత అధ్యక్షుడు ప్రసాద్, ధనంజయ, సోమశేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పూర్వవిద్యార్థి పారితోషికాలు



పారితోషికం అందుకున్న విద్యార్థులతో ఎమ్మీవో సతీష్‌బాబు

ఎర్రావారిపాలెం, జూలై 5(ఆంధ్రజ్యోతి) : పాఠశాలలో 30 మంది విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించాలో పూర్వ విద్యార్థి. నెరబైలుకు చెందిన కటారి మురళీ కృష్ణ స్థానిక మండల పరిషత్ మోడల్ ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 50 ఏళ్ల క్రితం చదివారు. ఉన్నత చదువులు పూర్తయ్యాక అమెరికాలో ఉదోగ్యరీత్యా స్థిరపడ్డారు. తాను చదివిన పాఠశాలలో 1 నుండి 10 తరగతి వరకు మొదటి,ద్వితీయ, తృతీయ స్థానాల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు 20 ఏళ్లుగా నగదు పారితోషికాన్ని అందిస్తున్నారు. ఈక్రమంలో శనివారం తన మేనమామ, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు నాగరాజు ద్వారా ఈ సహాయాన్ని అందజేశారు. మొదటి బహుమతిగా రూ.2వేలు, రెండో బహుమతిగా రూ.1200, తృతీయ బహుమతిగా రూ.800 వంతున 30 మందికి అందించారు. గతంలో డెస్కులు, ఆర్వోప్లాంట్‌లకు విరాళాలు అందించారు. కార్యక్రమంలో ఎమ్మీవో-2 సతీస్‌బాబు, హెచ్‌ఎం రెడ్డిచెర్ల సుబ్రమణ్యం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ



అవగాహన కల్పిస్తున్న డీఆర్పీ అశోక్, వేదికపై ఎంపీడీవో రామచంద్ర, అధికారులు

తిరుపతి రూరల్, జూలై5(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాకు చెందిన 19మండలాల ఎంపీడీవోలకు తిరుపతి రూరల్ మండల ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవోతోపాటు పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్లు శిక్షణకు హాజరయ్యారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపకల్పన చేయడం, సాధించడం వంటి అంశాలపై డీఆర్పీ అశోక్ నేతృత్వంలో అవగాహన కల్పించారు. అభివృద్ధి ఆధారంగా పంచాయతీలకు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో ర్యాంకులు కేటాయిస్తారన్నారు. చిత్తూరు జెడ్పీసీఈవో రవికుమార్‌నాయుడు సందర్శించారు. జిల్లాలో వివిధ శాఖల అధికారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

త్వరగా భవన నిర్మాణాలను పూర్తిచేయండి: ఈవో

తిరుమల, జూలై5(ఆంధ్రజ్యోతి): నిర్దేశిత సమయంలో భవన నిర్మాణ పనులను పూర్తిచేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఆయన శనివారం అధికారులతో సమీక్షించారు. ఈవో మాట్లాడుతూ కాంట్రాక్టర్లలో అలసత్వం లేకుండా ఇంజినీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి నివేదిక ఇవ్వాలన్నారు. దళారీ వ్యవస్థ, నకిలీ టికెట్ల పేరుతో సేవల టికెట్ల అమ్మకాలు, అవినీతిపై నిఘా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అన్నప్రసాదాల నిల్వకు వంటసామగ్రి కోసం మార్కెటింగ్ గోడౌన్‌లో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలన్నారు. అలిపిరి టోల్‌గేట్ చెకింగ్ పాయింట్ విస్తరణ, లేటెస్ట్ కెమెరాల ఏర్పాటు, వాహనాలు, లగేజీ స్కానింగ్ యంత్రాలు, సెక్యూరిటీ పెంపు వంటి అంశాలపై టీటీడీ సెక్యూరిటీ, ఇంజినీరింగ్, ఐటీ అధికారులు అంతర్జాతీయ విమానాశ్రయాల్లో సౌకర్యాలను పరిశీలించి నివేదిక సమర్పించాలన్నారు.

టీటీడీ పరిధిలోని వివిధ ఆలయాలతోపాటు పాపవినాశనం, శిలాతోరణం ప్రాంతాల్లో పనులనువేగంగా పూర్తి చేయాలన్నారు. సమీక్షలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, సీఈ సత్యనారాయణ, ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ పాల్గొన్నారు.

45 పొట్టేళ్ల స్వాధీనం : ఐదుగురి అరెస్టు



పొట్టేళ్లను రైతులకు అప్పగిస్తున్న పోలీసులు

తిరుచానూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): మేకలు, పొట్టేళ్లను ఎత్తుకెళ్లిపోయిన ఐదుగురిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. డీఎస్పీ ప్రసాద్ మీడియాకు వెల్లడించిన వివరాలమేరకు.. తిరుపతి రూరల్ మండలం నల్లమానుకాలువలో రైతు చంద్రశేఖర్‌రెడ్డి తన ఇంటిలో రెండు మేకలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో గురువారం మంగళం రోడ్డులో కారులో మేకలను తరలిస్తున్న మణికంఠ, చందు, జయకృష్ణ, నవీన్‌కుమార్, నితీష్‌లను పట్టుకున్నారు. వివిధ ప్రాంతాల్లో 12 మంది రైతుల నుంచి రెండు నెలల్లో వారు దొంగిలించిన 45 పొట్టేళ్లు, మేకలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. రెండు మోటారు సైకిళ్లు, కారును కూడా సీజ్ చేసినట్లు చెప్పారు. కేసును ఛేదించిన సీఐ సునీల్‌కుమార్, ఎస్ఐ సాయినాథ్ చౌదరి, పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు. పొట్టేళ్లను రైతులకు అప్పగించారు.

చెవిరెడ్డి అరెస్టుపై నిరసన

ఎర్రావారిపాలెం,జూలై 5(ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అరెస్టును శనివారం ఎర్రావారిపాలెంలో వైసీపీ శ్రేణులు నిరసించారు. పార్టీ నాయకులు చెంగల్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీపీ రెడ్డెమ్మ ఆధ్వర్యంలోని నాయకులు కార్యకర్తలు ఈమేరకు బస్టాండ్ నుంచి బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కరుణకర్‌రెడ్డి,మహేశ్వర్‌రెడ్డి,హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి పాత్రల వితరణ

తిరుచానూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి ఆలయానికి దామోదరన్ అనే దాత శనివారం రూ.60వేలు విలువ చేసే 20 ఇత్తడి పాత్రలను అందజేశారు. దాతకు అధికారులు కృతజ్ఞతలు తెలిపి తీర్థప్రసాదాలు అందజేశారు.

వేదోక్తంగా తైలాభిషేకం



శ్రీకాళహస్తి, జూలై 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న శనీశ్వరుడికి శనివారాన్ని పురస్కరించుకుని వేదోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి, కలశ పూజలను చేశారు. అనంతరం స్వామివారిని నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకించారు. అనంతరం పుష్పాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

వైభవంగా శ్రీవారి వేడుక



వడమాలపేట, జూలై 5(ఆంధ్ర జ్యోతి): మండలంలోని అప్పలాయ గుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వేంకటేశ్వరస్వామిని సర్వాభర ణాలు, సుగంధ పరిమళాలు వెదజల్లే పుష్పాలతో అలంకరించి వేదమంత్రాలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడై పద్మావతి, ఆండాల్ సమేత వేంకటేశ్వర స్వామిని మేళతాలాలు, మంగళ వాయిద్యాలు నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ అధికారి శివకుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చెంగాళమ్మ హుండీ ఆదాయం రూ.61.71 లక్షలు

సూళ్లూరుపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని శనివారం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో లెక్కించారు. 103 రోజులకుగాను మొత్తం రూ.61,71, 477 నగదు వచ్చింది. 35 గ్రాముల బంగారు, 130 గ్రాముల వెండీ, విదేశీ కరెన్సీ యుఎస్‌ఏ డాలర్స్ 10, సింగపూర్ డాలర్స్ 5, మలేషియా రింగట్స్ 10, సౌదీ రియాల్స్ 1 కానుకల రూపంలో వచ్చాయని సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మీ తెలిపారు. దేవదాయశాఖా అధికారి కె.నవీన్ కుమార్, మెప్మా సిబ్బంది, పోలీసులు, విశ్రాంత బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి



అవగాహన కల్పిస్తున్న డీజీఎం వెంకోబరావు

తిరుపతి(ఆటోనగర్), జూలై 5(ఆంధ్రజ్యోతి): శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని బీఎస్ఎన్ఎల్ తిరుపతి జిల్లా డీజీఎం వెంకోబరావు వెల్లడించారు. తిరుపతి బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో శనివారం సైబర్ నేరాలపై వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పేర్లతో నేరగాళ్ల వినియోగదారులను మోసం చేయడానికి తీవ్ర ప్రయత్నం చేస్తున్నారని, వారు పెట్టే ప్రలోభాలకు గురికారాదని తెలిపారు. ఫేక్ కాల్స్‌ను బ్లాక్ చేయడం, డిజిటల్ అరెస్టుపై అవగాహన కల్పించారు. బీఎస్ఎన్ఎల్ సంచార సాతి, డూ నాట్ డిస్టర్బ్, మైకాల్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలు వివరించారు.

సైబర్ నేరాలకు గురైనవారు 1930కు ఫోన్ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఏజీ సభ్యులు చిట్టిబాబు, వినియోగదారులు పాల్గొన్నారు.

పెరిగిన డ్రోన్ నిఘా

- తుమ్మలగుంట ఫ్లైఓవర్‌పై ఆకతాయిల ఫొటో షూట్
- డ్రోన్ కెమెరాలకు చిక్కిన యువకులకు పోలీసుల కౌన్సెలింగ్



తుమ్మలగుంట ఫ్లైఓవర్‌పై ఫొటో షూట్‌లు చేస్తున్న యువకులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా తుమ్మలగుంట ఫ్లైఓవర్‌పై ఫొటో షూట్ చేస్తున్న యువకులను డ్రోన్ కెమెరా పోలీసులకు పట్టిచ్చింది. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు, ఎస్‌ఐలు, డ్రోన్ కెమెరాల ఇన్‌చార్జులు, సిబ్బంది కలసి తుమ్మలగుంట పరిసర ప్రాంతాల్లో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారు జాము వరకు డ్రోన్ కెమెరాతో బీట్ నిర్వహించారు. ఈ క్రమంలో ఫ్లైఓవర్‌పై కొంతమంది యువకులు వాహన చోదకులకు ఇబ్బంది కలిగే విధంగా ఫొటో షూట్ చేస్తుండటాన్ని గమనించిన పోలీసులు డ్రోన్ కెమెరాతో నిఘా వుంచారు. దీన్ని గమనించిన యువకులు అక్కడనుంచి బైక్‌లపై పరారయ్యారు. తిరుపతి రూరల్ సీఐ వారిని వెంబడించి అదుపులోకి తీసుకుని విచారించారు. విద్యార్థులుగా తెలియడంతో మొదటి తప్పుగా భావించి కౌన్సెలింగ్ చేసి వదలిపెట్టారు. వాహన చోదకులకు ఇబ్బంది కలిగించే విధంగా ఫ్లైఓవర్‌లపై పార్టీలు, ఫొటో షూట్‌లు, బైక్ రేసులు వంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

నేడు బీసీల ఆత్మగౌరవసభ

- హాజరుకానున్న మంత్రులు, బీసీ సంఘాల ముఖ్య ప్రతినిధులు



మాట్లాడుతున్న మాజీ మంత్రి పరసారత్నం

తిరుపతి అర్బన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బీసీల్లో ఐక్యమత్యం పెంపొందించి, సమస్యలను ప్రభుత్వం ద్వారా పరిష్కరించుకుంటూ సామాజిక న్యాయం సాధించడమే లక్ష్యంగా ఆదివారం సాయంత్రం స్థానిక ఇందిరా మైదానంలో బీసీల ఆత్మగౌరవసభ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కల్లూరి నాగరాజుగౌడ్, అంబేడ్కర్, పూలే ఫౌండేషన్ వ్యవస్థాపకులు పరసారత్నం సభ నిర్వహణ విషయాలను శనివారం మీడియాకు వివరించారు. కనీవినీ ఎరుగని రీతిలో సభ జరగనుందని, అందుకు తగిన ఏర్పాట్లుచేశామన్నారు. మధ్యాహ్నం స్థానిక బాలాజీ కాలనీలోని పూలే విగ్రహం నుంచి ర్యాలీగా ఇందిరా మైదానానికి చేసుకుంటామన్నారు. సభకు మంత్రులు, ఎమ్మెల్యేలు, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలియజేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలు పెద్దఎత్తున హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. కులమతాలకు అతీతంగా సభ జరుగుతుందని, అంబేడ్కర్, పూలే అభిమానులు కూడా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

భారీ బందోబస్తు ఏర్పాటు

తిరుపతి(నేరవిభాగం), జూలై 5(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఆదివారం బీసీల ఆత్మ గౌరవ భరోసా సభకు రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌లు హాజరవుతున్నారు. దీంతో తిరునగరి వీఐపీల సందడితో హడావుడిగా కనిపించనుంది. మరోవైపు నెల్లూరు పర్యటన కోసం మంత్రి నారా లోకేష్ తిరుపతి విమానాశ్రయానికి విచ్చేస్తున్నారు. ఈ రెండు కార్యక్రమాలను పురస్కరించుకుని జిల్లా పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. తిరుపతి విమానాశ్రయం వద్ద కేంద్ర బలగాలతో పాటు సివిల్ పోలీసులను నియమించారు. మరోవైపు స్థానిక ఇందిరా మైదానంలో ఆదివారం బీసీల ఆత్మగౌరవ భరోసా సభ జరుగనున్న తరుణంలో ఇద్దరు మంత్రులు వస్తున్నారు. ఈ క్రమంలో అదనపు ఎస్పీ రవిమనోహరాచారి నేతృత్వంలో ఇద్దరు డీఎస్పీలు, ఐదుగురు సీఐలు, 10 మంది ఎస్‌ఐలు, మరో 100 మంది పోలీసు బలగాలను బందోబస్తు నిమిత్తం నియమిస్తున్నారు. ఇప్పటికే ఇందిరా మైదానాన్ని డాగ్ స్క్వాడ్‌లు తనిఖీలు చేయగా, మైదానం చుట్టూ ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ

- మేయర్ డాక్టర్ శిరీష



అగ్ని ప్రమాదాల నివారణపై సమావేశమైన మేయర్ శిరీష, కమిషనర్ మౌర్య

తిరుపతి, జూలై 5(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాల నివారణ అప్రమత్తంగా ఉండటంతోనే సాధ్యమవుతుందని నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. గోవిందరాజుల ఆలయ సన్నిధి వీధిలో తరచుగా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో మేయర్ నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్యతో కలిసి విపత్తు నివారణ అగ్ని మాపక శాఖ అధికారులు, షాపు నిర్వాహకులతో సంస్థ కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నిత్యం శ్రీవారి భక్తులు సందర్శించే ఆలయాలు నగరంలో ఉన్నందున ప్రజలకు, భక్తులకు, షాపుల్లో పనిచేసే కార్మికుల భద్రత రీత్యా నిబంధనలు పాటిస్తూ అగ్ని ప్రమాదాలను నివారించాలని సూచించారు. గోవిందరాజుల ఆలయ సన్నిధివీధి ప్రాంతంలో అగ్నిమాపక శాఖ నిబంధనలు పాటించేలా షాపు యజమానుల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. వారందరూ కలిసి కనీస ప్రమాద నివారణ ఏర్పాట్లు చేసుకుంటే నగరపాలక సంస్థ నుంచి తగిన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉప కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యామసుందర్, డీసీపీ ఖాన్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, ఆరోగ్యాధికారి యువ అన్వేష్, జిల్లా, నగరపాలక సంస్థ విపత్తు నివారణ అగ్ని మాపక శాఖ అధికారులు, షాపు నిర్వాహకులు పాల్గొన్నారు.

చేనేత వస్త్ర, హస్తకళ ప్రదర్శన ప్రారంభం



క్రాఫ్ట్‌బజార్‌ను ప్రారంభించి స్టాల్స్‌ను వీక్షిస్తున్న టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి అర్బన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు చేయూత నివ్వడంలో భాగంగా స్థానిక బైరాగి పట్టెడ జగ్జీవన్‌రామ్ ఉద్యానవనం సమీపంలో ఏర్పాటుచేసిన చేనేత వస్త్ర, హస్తకళ ప్రదర్శనను శనివారం సాయంత్రం టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన స్టాల్స్‌ను పరిశీలిస్తూ నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ టవల్స్, రాజస్తాన్ గాజులు, ఇమిటేషన్ జ్యువెలరీ, బెంగాలీ కాటన్, కలంకారీ చీరలు, డ్రస్సులు వంటి వస్తువులు అందుబాటులో ఉన్నాయన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి తయారీదారులచే విక్రయాలు జరుగుతాయన్నారు. కాఫ్టబజార్‌ను సందర్శించి చేనేత కార్మికులను, హస్తకళాకారులను ఆదరించాలని ఆయన కోరారు.

కొనసాగిన ఈయూ ధర్నా



తిరుపతి డిపో ముందు ధర్నాచేస్తున్న ఎంప్లాయిస్ యూనియన్

తిరుపతి(ఆర్టీసీ), జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ ధర్నా రెండో రోజు శనివారం కొనసాగింది. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లా కార్యదర్శి వి.మస్తాన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.అర్జున, రాష్ట్ర కార్యదర్శి ఈ.ఆర్.కుమార్ ఆధ్వర్యంలో అన్ని డిపోల్లో ఎర్రజెండాలు, బ్యానర్లు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈయూ జిల్లా నాయకులు ఎస్.ఎస్.మణ్యం, జె.సతీష్ నాయుడు, తిరుపతి, తిరుమల డిపోల అధ్యక్ష కార్యదర్శులు, నాయకులు, ఉద్యోగులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. గత రెండు రోజులుగా ధర్నాలో పాల్గొని విజయవంతం చేసినందుకు ఈయూ సభ్యులకు జిల్లా కమిటీ ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.

యాచకుల పునరావాస కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

- కమిషనర్ ఎన్.మౌర్య



యాచకుల పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, జూలై 5(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో యాచకుల పరివర్తన కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. స్మైల్ ప్రాజెక్టులో భాగంగా స్థానిక ముత్యాలరెడ్డిపల్లి వద్ద నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యాచకుల పునరావాస కేంద్రాన్ని శనివారం ఉదయం కమిషనర్ పరిశీలించారు. అక్కడ ఉన్న వారితో ఎక్కడి నుండి వచ్చారు? పునరావాస కేంద్రంలో వసతులు ఎలా ఉన్నాయి? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో ఎక్కడైనా యాచకులు ఉంటే ఈ పునరావాస కేంద్రానికి తీసుకురావచ్చని తెలిపారు. వారికి ఈ కేంద్రంలో అన్ని వసతులు కల్పించి, ఇష్టమైన వృత్తిలో శిక్షణ ఇస్తామని చెప్పారు. వారు తిరిగి భిక్షాటన చేయకుండా వారి కాళ్ల మీద వారు నిలబడేలా శిక్షణ ఇచ్చి పంపుతామని అన్నారు. అనంతరం ముత్యారెడ్డిపల్లి వద్ద ఉన్న పార్కును పరిశీలించారు. పార్కులో పాడైన వ్యాయామ, ఆట వస్తువులను మరమ్మతులు చేయించి, శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

పనితీరు సమీక్షతో బోధనలో నాణ్యత

- ఎస్వీయూ వీసీ అప్పారావు



సమీక్ష నిర్వహిస్తున్న యూనివర్సిటీ అధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 5(ఆంధ్రజ్యోతి): అకడమిక్ కన్సల్టెంట్లకు చేపట్టిన పనితీరు సమీక్షతో బోధనలో నాణ్యత పెరుగుతుందని ఎస్వీయూ వీసీ అప్పారావు అన్నారు. ఈ నెల 1 నుంచీ 5వ తేదీ దాకా యూనివర్సిటీలోని 48 విభాగాలకు చెందిన 241 మంది అకడమిక్ కన్సల్టెంట్లకు పనితీరు సమీక్ష చేపట్టారు. వీసీ అప్పారావు అధ్యక్షతన, రిజిస్ట్రార్ భూపతి నాయుడు కన్వీనర్‌గా సంబంధిత కాలేజీ ప్రిన్సిపాళ్లు, హెడ్స్, విషయ నిపుణుల సమక్షంలో ఈ సమీక్ష నిర్వహించారు. గత నెల 19వ తేదీన రాష్ట్ర ఉన్నత విద్యామండలి జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ సమీక్ష చేపట్టారు. సుప్రీంకోర్టు, హైకోర్టు, యూజీసీ నియమావళిని అనుసరించి ఈ ప్రక్రియ చేపట్టినట్టు అధికారులు చెప్పారు. అకడమిక్ కన్సల్టెంట్ల బోధనా సామర్థ్యాలను మెరుగుపర్చుకోవడానికి, ఆధునిక బోధనా పద్ధతులను అవలంబించడానికి, ఉన్నత విద్యా ప్రమాణాలకు అనుగుణంగా ఉండటానికి ఈ సమీక్ష ప్రేరణాత్మక వేదికగా పనిచేస్తుందని వారన్నారు. ఈ సమీక్ష ప్రత్యక్ష వీడియో రికార్డింగ్‌లతో సజావుగా, పారదర్శకంగా నిర్వహించబడిందన్నారు. సమీక్షలో పాల్గొన్న విషయ నిపుణులు, అధికారులందరికీ యూనివర్సిటీ తరుపున వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టులో జైఆదిత్య, హిమకేష్



జైఆదిత్య, హిమకేష్

తిరుపతి(క్రీడలు), జూలై 5(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న అండర్-15 జూనియర్ నేషనల్స్ ఫుట్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్న రాష్ట్రజట్టులో తిరుపతి నగరానికి చెందిన విద్యార్థులు జైఆదిత్య, హిమకేష్ పేర్లు ఖరారయ్యాయి. ప్రస్తుతం ఎడిఫైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న వీరిరువురు ఫుట్‌బాల్ క్రీడలో ఉత్సాహంగా పాల్గొని ప్రతి మ్యాచ్‌లో విశేష ఆటతీరును ప్రదర్శించేవారు. కోచ్‌ల నుంచి సమగ్ర శిక్షణ పొంది అంచెలంచెలుగా ఎదిగారు. పాఠశాల స్థాయి నుంచి జిల్లా, జోనల్, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిథ్యం వహించి తమ సత్తా చాటుకున్నారు. ఇటీవల నిర్వహించిన ప్రాపబుల్స్‌లో వీరి ఆటతీరును పరిశీలించిన సెలక్టర్లు రాష్ట్రజట్టుకు ఎంపిక చేస్తూ ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు క్రీడా ప్రముఖులు, తల్లిదండ్రులు వీరిని అభినందించారు. రాబోవు జూనియర్ నేషనల్స్‌లోనూ రాణించాలని ఆకాంక్షించారు.

13న రాష్ట్రస్థాయి ఓపెన్ బాడీ బిల్డింగ్ పోటీలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

తిరుపతి(క్రీడలు), జూలై 5(ఆంధ్రజ్యోతి): ఈనెల 13న రాష్ట్రస్థాయి ఓపెన్ బాడీ బిల్డింగ్ పోటీలను పురస్కరించుకొని శనివారం స్థానిక ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో జరిగిన కార్యక్రమంలో గోల్డెన్ ఇండియన్ బాడీబిల్డింగ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు వై.ప్రవీణ్ ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. వచ్చే ఆదివారం కడపలో జరిగే ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 300మంది బాడీబిల్డర్స్ ప్రాతినిధ్యం వహించే అవకాశాలున్నాయని ఈ సందర్భంగా కడపజిల్లా కమిటీ ప్రతినిధులు నగేష్, యూనిస్ బాషా తెలియజేశారు. దీంతో పోటీల నిర్వహణకయ్యే ఖర్చులకు రూ.55వేలు తనవంతు సాయంగా ప్రవీణ్ ప్రకటించారు.

మామిడి రైతులకు మొదలైన వేధింపులు

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు కరుణాకరరెడ్డి

తిరుపతి(జీవకోన), జూలై 5(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 9న పర్యటించనున్న కారణంగా మామిడి రైతులకు వేధింపులు మొదలయ్యాయని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి ఆరోపించారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిత్తూరు మండలానికి చెందిన కుమార్ అనే రైతు మామిడికి గిట్టుబాటు ధర లేకపోవడంతో తనకు ఉన్న మామిడితోటలో 16 చెట్లను కొట్టుకునేందుకు ప్రయత్నించాడని, వెంటనే ఫారెస్టు అధికారులు అక్కడ వాలిపోయి అతడిని నిర్బంధించి జగన్ పర్యటన కోసమే ఇదంతా చేస్తున్నావా అంటూ బెదిరించి రూ.12,750 అపరాధ రుసుం ఈ నెల 4న విధించారన్నారు. ఆ రైతు ఎంత మొరపెట్టుకున్నా కూడా పట్టించుకోలేదన్నారు. ఎర్రచందనం దొంగలను వదలి రైతును దొంగలా వేధించడం సరైన పద్ధతి కాదని, పవన్ మీ శాఖలో జరుగుతున్న తీరు ఇలా ఉందంటూ విమర్శించారు. జగన్ పర్యటనలో నాయకులను, రైతులను నిర్బంధించాలనే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఎన్ని ఆటంకాలు కలిగించినా జగన్ పర్యటన జరిగి తీరుతుందని ఆయన స్పష్టం చేశారు.

జోరుగా 'సుపరిపాలనలో తొలి అడుగు'



రామచంద్రనగర్‌లో అపరిష్కృతంగా ఉన్న దేవాలయాన్ని పూర్తిచేయాలని ఎమ్మెల్యే నానీని కోరుతున్న గ్రామస్తులు

తిరుపతి అర్బన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): మంగళం పరిధిలోని తిరుమల నగర్ పంచాయతీ రామచంద్రనగర్‌లో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జోరుగా కొనసాగింది. కార్యక్రమం ప్రారంభంలో ఎమ్మెల్యే పులివర్తి నానికి మహిళలు పెద్ద ఎత్తున హారతులు పట్టగా, నాయకులు గజమాలతో సత్కరించారు. అనంతరం ఆయన ఇంటింటికి తిరిగి ఏడాదికాలంలో ప్రభుత్వం అందించిన సంక్షేమాలు, తాను చేసిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తుచేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఆప్యాయంగా పలకరిస్తూ తన దృష్టికి రాని సమస్యలు ఉంటే చెప్పాలని, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తానన్నారు. రేషన్ బియ్యం తీసుకోవడంలో సమస్య ఎక్కువగా ఉందని, అపరిష్కృతంగా ఉన్న దేవాలయాన్ని పూర్తిచేయాలని, చెన్నాయిగుంట చెరువును అభివృద్ధి చేయాలని, మురుగునీరు అరికట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన ఆయన యూడీఎస్ వ్యవస్థకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, పూర్తిస్థాయిలో నిర్మించడానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పేదల సౌకర్యార్థం ప్రభుత్వం పీ 4 విధానాన్ని ప్రవేశపెట్టిందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, ఉమ్మడి మంగళం అధ్యక్షుడు ఈశ్వరయ్య, ఎస్.గోవిందరాజులు, పెరుగు భాస్కర్‌రెడ్డి, గోపీనాథ్, సురేష్ నాయుడు, మహేశ్వరి, చంద్ర, జనార్దన్, నాగరాజుయాదవ్, ఢిల్లీబాబు, రాధాకృష్ణ, రాంజీ, ప్రభాకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'తిరుపతి జిల్లా కవితా సంకలనం' ఆవిష్కరణ



తిరుపతి జిల్లా కవితా సంకలనం - నాన్నారం కథలు పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సాహిత్య ప్రముఖులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 5(ఆంధ్రజ్యోతి): అభ్యుదయ రచయితల సంఘం రూపొందించిన తిరుపతి జిల్లా కవితా సంకలనం పుసకావిష్కరణ నిర్వహించారు.అరసం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యువశ్రీ మురళి, నెమిలేటి కిట్టన్న నేతృత్వంలో స్థానిక వేమన విజ్ఞాన కేంద్రంలో శనివారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సాహిత్య ప్రముఖులు మూరిశెట్టి గోవిందు, గొడుగుచింత గోవిందయ్య, తోట వెంకటేశ్వర్లు, ఆర్వీ కృష్ణస్వామిరాజు, ఆముదాల మురళి, పేరూరు బాలసుబ్రమణ్యం, యువశ్రీ మురళి, మన్నవ గంగాధరప్రసాద్, నెమిలేటి కిట్టన్న, మౌని, మల్లేశ్వరరావు, హేమంత్‌కుమార్, ఏనుగు అంకమ నాయుడు, మల్లారపు నాగార్జున, నడ్డి నారాయణ తదితరులు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రపంచీకరణను ప్రతిబింబించేలా పుస్తక ముఖచిత్రం ఉందన్నారు. 37 మంది కవుల్లో అనేక మంది కొత్తగా ఇందులో కవిత్వం రాయడం విశేషమన్నారు. ఇటువంటి పుస్తకాల ద్వారా జనంలో పఠనాసక్తి పెంచడం, చైతన్యం చేయడానికి ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సాకం నాగరాజ, ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు, ఉషారాణి, లక్ష్మి, బాదుల్లా, గుల్జార్, ఆమూరి సుబ్రమణ్యం, బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు. ● అదేవిధంగా రచయిత ఆర్వీ కృష్ణస్వామిరాజు రాసిన నాన్నారం కథలు పుస్తకాన్ని కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్వీయూ ఓఆర్‌ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రచయిత కృష్ణస్వామి రాజు రాసిన కథలన్నీ దాదాపు గ్రామీణ జీవిత నేపథ్యం కల్గినవేనని చెప్పారు. నాన్నారం కథలను హైదరాబాదుకు చెందిన బ్రెడ్ సంస్థ రెండు వేల కాపీలు ప్రచురించి స్కూల్ లైబ్రరీలకు ఉచితంగా ఇవ్వడం అభినందనీయమన్నారు.

8న జిల్లా బేస్‌బాల్ జట్ల ఎంపిక

తిరుపతి(క్రీడలు), జూలై 5(ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతంలోని మంగళం ట్రెండ్స్ ఉన్నతపాఠశాల మైదానంలో ఈనెల 8న జిల్లా బేస్‌బాల్ బాల బాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు బేస్‌బాల్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు సోము రవికుమార్, సాంబశివరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగలవారు సొంత క్రీడా సామగ్రితో హాజరుకావాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపికైన జట్లు ఈనెల 12నుంచి 14వరకు సత్యసాయి జిల్లా కదిరిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అక్కడ ప్రతిభచాటిన క్రీడాకారులను జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికచేస్తారని వివరించారు.

అదానీ స్మార్ట్ మీటర్ల ఒప్పందాలు రద్దు చేయాలి



తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

తిరుపతి(ఆటోనగర్), జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అదానీ స్మార్ట్ మీటర్ల కొనుగోలు ఒప్పందాలను కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. శనివారం తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు అమర్చడానికి కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు ఎందుకు స్మార్ట్ మీటర్లు అమర్చుతున్నారని ప్రశ్నించారు. ఏడాది క్రితం స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగులకొట్టమని పిలుపునిచ్చారు కదా.. ఆ పిలుపు మేరకు ప్రస్తుతం మీటర్లను పగులకొడితే మద్దతిస్తారా అని వారు ప్రశ్నించారు. పెంచిన చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. అదానీని రాష్ట్రం నుంచి సాగనంపాలని వారు కోరారు. ఈ ఆందోళనలో నాయకులు విశ్వనాథ్, సి.పెంచలయ్య, కె.రాధాకృష్ణ, ఎన్‌డీ రవి, అల్లాబక్ష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఆత్మగౌరవ భరోసా సభకు మద్దతు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జూలై 5(ఆంధ్రజ్యోతి): బీసీల ఆత్మగౌరవ భరోసా సభ ఆదివారం జరగనున్న నేపథ్యంలో జానపద వృత్తి కళాకారుల సంఘం మద్దతు ఇస్తోందని ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు పులిమామిడి యాదగిరి, ప్రధానకార్యదర్శి తంజావూరు మునేంద్ర అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ ఇందిరా మైదానంలో జరిగే బీసీ ఆత్మగౌరవ మహాసభకు నాయకత్వం వహిస్తున్న పరసా రత్నం పిలుపు మేరకు బీసీ సంఘం జాతీయ నాయకులు ఆల్మన్‌రాజు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరు నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు.

నగర సంకీర్తన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 5(ఆంధ్రజ్యోతి): తిరువీధులు గోవింద నామ స్మరణతో మార్మోగాయి. ప్రతి శనివారం క్రమం తప్పకుండా చేపడుతున్న నగర సంకీర్తన ఆధ్యాత్మికతను పంచింది. స్థానిక భజన మండలి కళాకారుల కోలాట ప్రదర్శన ఇందులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాయలసీమ రంగస్థలి అధ్యక్షులు గుండాల గోపీనాథ రెడ్డి మాట్లాడుతూ.. అటు భక్తుల్లో, ఇటు ప్రజల్లో భక్తి భావాలను పెంపొందించడానికి నగర సంకీర్తన చేపడుతున్నట్లు తెలిపారు. మేకల గంగయ్య, వాసుదేవరెడ్డి, మునిరత్నమాచారి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, మధు, కల్పన, పద్మనాభం, పార్వతి, మునీంద్ర, విక్రం పాల్గొన్నారు.


బాలు రచించిన గేయం

మహారాష్ట్ర తెలుగు పాఠంగా
మన బాలు గేయం



కయ్యూరి బాలసుబ్రహ్మణ్యం

శ్రీకాళహస్తి, జూలై 5(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం దిగువసాంబయ్యపాళెం ఫౌండేషన్ పాఠశాల ఉపాధ్యాయుడు, కవి, రచయిత, మిమిక్రీ కళాకారుడు కయ్యూరు బాలసుబ్రహ్మణ్యం రాసిన గేయానికి మహారాష్ట్ర ప్రభుత్వ తెలుగు పాఠ్యాంశంలో చోటు దక్కింది. ఈ సంవత్సరం ఒకటో తరగతి బాలభారతి తెలుగు వాచకంలో బాలు రాసిన సీతాకోకచిలుక గేయాన్ని పాఠ్యాంశంగా ప్రచురించింది. ఈ సందర్భంగా బాలు మాట్లాడుతూ.. తాను రాసిన గేయం మహారాష్ట్ర ప్రభుత్వం అక్కడి తెలుగు విద్యార్థులకు పరిచయం చేస్తూ పాఠ్యాంశంగా తీసుకురావడం చాలా ఆనందంగా ఉందన్నారు.

16న శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం

తిరుమల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో 16వ తేదీన ఆణివార ఆస్థానం జరగనున్న నేపథ్యంలో ముందురోజైన 15వ తేదీ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం(ఆలయ శుద్ధి) కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ రెండు ఉత్సవాల నేపథ్యంలో స్వయంగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. 14, 15 తేదీల్లో సిఫార్సు లేఖలను తీసుకోబోమని స్పష్టం చేసింది. ఆణివారం ఆస్థానం రోజున ఆలయంలోని బంగారు వాకిలిలో సర్వభూపాల వాహనంలో ఉత్సవమూర్తులను కొలువుదీరుస్తారు. అలాగే మరోపీఠంపై స్వామి సర్వసైనాధ్యక్షుడైన విష్వక్సేనులస్వామి దక్షిణాభిముఖంగా వేంచేపు చేస్తారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు ప్రత్యేకపూజలు, ప్రసాదాలు నివేదిస్తారు. తర్వాత శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు తమ తలకు శ్రీవారి పాదవస్త్రంతో 'పరివట్టం' (చిన్నపట్టుగుడ్డ) కట్టుకుని స్వామివారి ద్వారా బియ్యపు దక్షిణ స్వీకరించి 'నిత్యైశ్వర్యోభవ' అని స్వామిని ఆశీర్వదిస్తారు. తర్వాత అర్చకులు పెద్ద, చిన్నజీయర్ స్వాములకు, టీటీడీ తరపున ఈవోకు 'లచ్చన' అను తాళపు చెవి గుత్తిని వరుస క్రమంలో కుడి చేతికి ఇచ్చి, 'రూపాయి' హారతి, చందనం, తాంబూలం, తీర్థం, శఠారి మర్యాదలు చేస్తారు. అనంతరం ఈ తాళపు చెవి గుత్తిని శ్రీవారి పాదాల వద్ద ఉంచడంతో ఆణివార ఆస్థానం ముగుస్తుంది.

శ్రీవారి దర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.


గురువారం హుండీ ఆదాయం: రూ.3.53 కోట్లు
శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,011
తలనీలాలు సమర్పించినవారు: 28,496

ప్రోగ్రెస్ రిపోర్ట్

తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఈ ఏడాది కాలంలో ఏం చేశారు? ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేరాయి? పెండింగ్‌లో ఉండిపోయిన సమస్యలపై ఆయన ఏమంటున్నారు? శాసనసభ్యుడిగా ఆరణి శ్రీనివాసులును గెలిపించిన తిరుపతి నగర ప్రజలు ఆయన నుంచి ఏం కోరుతున్నారు? రెండో ఏడాదిలో తిరుపతి నగరం అభివృద్ధికి ఏం చేయదలచుకున్నారు?.. అనే ప్రశ్నలకు సమాధాన సమాహారమే ఇది..

- కథనం, ఇంటర్వ్యూ : తిరుపతి, ఆంధ్రజ్యోతి



ఏడాదిలో 1 ఏం చేశారు?

● తిరుమల ప్రక్షాళన ప్రారంభం ● శెట్టిపల్లి సమస్య సెటిల్ ● గంగమ్మగుడి పూర్తి చేశాం

ప్రశాంత తిరుపతి సాధించాం!

హామీ స్థానికులకు శ్రీవారి దర్శనం పునరుద్ధరిస్తాం.
అమలు: ప్రతినెలా రెండో మంగళవారం స్థానికులకు దర్శనం ఏర్పాటు జరిగింది.

హామీ నిజమైన టీడీఆర్ బాండ్ల లబ్ధిదారులకు న్యాయం చేస్తాం.
అమలు: బాండ్ల జారీలో అవకతవకలపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది. ప్రస్తుతం 207 మందికి బాండ్లు అందజేశారు. దశలవారీగా విచారించి మిగిలిన వారికి కూడా బాండ్లు ఇస్తామని చెబుతున్నారు.

హామీ శెట్టిపల్లి సమస్యను పరిష్కరిస్తాం.
అమలు: కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్యలు చొరవ తీసుకుని చర్చలు జరిపారు. శెట్టిపల్లి సమగ్రాభివృద్ధికి అన్ని పక్షాల అంగీకారం లభించింది. త్వరలోనే శెట్టిపల్లి భూ బాధితులకు ప్రోసీడింగ్స్ అందుతాయని చెబుతున్నారు.

హామీ అర్ధాంతరంగా వదిలేసిన తాతయ్యగుంట గంగమ్మ ఆలయ నిర్మాణాన్ని పూర్తిచేస్తాం.
అమలు: టీటీడీ సహకారంతో రూ.10కోట్లుతో గంగ జాతరలోపు ఆలయాన్ని పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

హామీ ప్రశాంత తిరుపతిగా మారుస్తాం
అమలు: కూటమి అధికారంలోకి వచ్చాక తిరుపతి ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.అరాచకాలు, దౌర్జన్యాలు తగ్గాయి.కబ్జాల భయం తగ్గింది.

హామీ అంతర్గత రోడ్లు నిర్మిస్తాం. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు పూర్తి చేస్తాం.
అమలు: గత వైసీపీ ప్రభుత్వం కార్పొరేషన్ నిధులను ఖాళీ చేసింది. పైగా కాంట్రాక్టర్లకు రూ.80కోట్లకు పైగా బకాయి పెట్టారు. కూటమి ప్రభుత్వం కాంట్రాక్టర్లకు దశలవారీగా బిల్లులు చెల్లిస్తూనే ఈ ఏడాదిలో దాదాపు రూ.30కోట్లతో 267 అభివృద్ధి పనులను చేపట్టారు. కొత్తరోడ్లు, ప్యాచ్ వర్కులు, కాలువల్లో పూడికతీత, తాగునీటి పైపులైన్ల మరమ్మతులు వంటి పనులు జరిగాయి. మరో రూ.17కోట్లతో 45 పనులు టెండరు దశలో ఉన్నాయి.

హామీ అధికారంలోకి వచ్చాక తిరుమలను ప్రక్షాళన చేస్తాం.
అమలు: తిరుమల నుంచి సీఎం చంద్రబాబు ఆదేశంతో ఇప్పటికే ప్రక్షాళన ప్రారంభమైంది. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణలు జరుగుతున్నాయి. వీఐపీ బ్రేక్ దర్శనాలు క్రమబద్ధీకరించాం. అన్నప్రసాదాలు నాణ్యత పెంచాం. లడ్డూ రుచి పెరిగింది.

వైసీపీ పాపం తిరుపతి స్మార్ట్‌కు శాపం

కేంద్ర ప్రభుత్వం విడుదలచేసే స్మార్ట్ సిటీ నిధులకు మ్యాచింగ్ గ్రాంట్‌గా రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి. వైసీపీ హయాంలోని ఐదేళ్లలో పైసా కూడా ఇవ్వలేదు. స్మార్ట్‌సిటీ గడవుపూర్తయింది. ఇక కేంద్ర ప్రభుత్వ నిధులు నిలిచిపోయాయి. దీంతో ప్రధానమైన మున్సిపల్ పరిపాలన భవనం, మల్టీలెవల్ కార్ పార్కింగ్, క్రికెట్ స్టేడియం వంటి పనులు ఆగిపోయాయి. వీటిని పూర్తి చేయాలి. నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని విక్రయించి వచ్చే నిధులతో మున్సిపల్ కార్యాలయాన్ని పూర్తిచేయాలని భావిస్తే.. దానిమీద వైసీపీ దుష్ప్రచారం చేసింది. త్వరలోనే తగు నిర్ణయంతీసుకుని పరిపాలన భవనాన్ని పూర్తిచేస్తాం.

'ఆంధ్రజ్యోతి'తో కలిసి జీవకోన ముఖచిత్రం మార్చాం



'అక్షరమే అండగా..పరిష్కారమే అజెండగా' నినాదంతో 'ఆంధ్రజ్యోతి'నిర్వహించిన సదస్సు ద్వారా తిరుపతి జీవకోన ముఖచిత్రం మార్చాం. నా సొంత నిధులతో జీవకోన ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రెండు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశాను. మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా దాదాపు రూ.1.20లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్లు, ప్యాచ్ వర్కులు పూర్తి చేశాం. ఇచ్చిన హామీ మేరకు పోలీస్ అవుట్ పోస్టును కూడా ప్రారంభించాం. ఇవికాకుండా మరో రూ.52.30లక్షల పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) రూ.35లక్షలతో జీవకోన వద్ద గల లెప్రసీ కాలనీలో రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

ప్రజల ప్రశ్నలు - ఎమ్మెల్యే జవాబులు



? తిరుపతిలో డ్రైనేజీ వ్యవస్థ పాతికేళ్లకన్నా కిందటిది. చిన్నవానకే కాలువలు పొంగిపొర్లుతున్నాయి. గతంలోనూ దీన్ని ఎవరూ పట్టించుకోలేదు. మీరైనా తిరుపతి డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళనకు పూనుకోండి ఎమ్మెల్యేగారూ.

- ఎం.బాబు, జీవకోన

! 1999లో టీడీపీ హయాంలోనే అప్పటి సీఎం నారా చంద్రబాబు నాయుడు తిరుపతికి యూడీఎస్‌ను తీసుకొచ్చారు. నగరం విస్తరించింది. యూడీఎస్ పైపుల సామర్థ్యం కన్నా ఎక్కువగా మురుగునీరు ప్రవహించడం వలన మ్యాన్ హోల్స్ తెరుచుకుంటున్నాయి. యూడీఎస్ రీవ్యాంప్‌కు రూ.80కోట్లు అవసరం. నగరపాలక సంస్థ నిధులు సరిపోవు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేంద్ర నిధులు తీసుకొచ్చి యూడీఎస్‌ను రీవ్యాంప్ చేస్తాం. ఈ ఏడాదిలోనే నిధులు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. తిరుపతి యూడీఎస్‌ను కేంద్ర ప్రభుత్వ ప్రజారోగ్య, పర్యావరణ ఇంజనీరింగ్ సంస్థ (చెప్కో) అడ్వైజర్ కమిటీ ప్రతినిధులు ఇటీవల పరిశీలించారు. కమిషనర్ మౌర్య ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

- ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్యే





? పలుసార్లు రిజిస్ట్రేషన్లు జరిగి తర్వాత హఠాత్తుగా 22ఏ (నిషేధిత జాబితా)లో పెట్టడం వలన క్రయ, విక్రయాలకు చేసుకోలేకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దీనిపై మీరు తగిన నిర్ణయం తీసుకునేలా ప్రయత్నించండి ఎమ్మెల్యేగారూ.

- డాక్టర్ ఎన్.ధర్మయ్య, రిటైర్డ్ అధికారి

! రాజకీయ కక్షతోనే వైసీపీ హయాంలో కొన్ని ప్రాంతాల్లో 22ఏ (నిషేధిత జాబితా)లో పెట్టి భూ హక్కును కోల్పోయేలా చేశారు. దీని వలన అక్కరకు అమ్ముకోవాలంటే అడ్డంకిగా మారుతోంది. 22ఏ జాబితాలో ఉన్న వాటిని దశలవారీగా తొలగిస్తున్నాం. ఇటీవలే గంగమ్మ గుడి ప్రాంతాన్ని తొలగించి వారికి ఊరటకలిగించాం.

- ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్యే



? తిరుపతికి తూర్పువైపున ఒక్క అన్న క్యాంటీన్ కూడా లేదు. కార్మికులు ఎక్కువగా ఉండేది ఇక్కడే. ఈ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లు పెడతామని మీరు ఇచ్చిన హామీని గుర్తు చేస్తున్నాను.

- సుబ్రమణ్యం నాయుడు, సత్యనారాయణపురం

! తిరుపతిలో 4 అన్న క్యాంటీన్లున్నాయి. మరో 3 అవసరమని సీఎంను కోరాను. సానుకూలంగా స్పందించారు. కార్మిక, శ్రామిక వర్గం ఎక్కువగా ఉండే ఆటోనగర్, జీవకోన, లీలా మహల్ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటుచేయనున్నాం.

- ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్యే

ఈ ఏడాది ఇవి చేస్తా!

ఎమ్మార్‌పల్లెలో మరో 2 వాటర్ ప్లాంట్లు: జేఎంసీ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్లను జీవకోనలో ఏర్పాటు చేసిన విధంగా ఎమ్మార్ పల్లెలో కూడా మరో 2 ఏర్పాటు చేయబోతున్నాం.

తిరుపతిలో ప్రభుత్వ కాలేజీలు: తిరుపతిలో ఇప్పటివరకు ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కాలేజ్ లేదు. టీటీడీ ఆధ్వర్యంలో మాత్రమే కళాశాలలు ఉన్నాయి. అందుకే ప్రభుత్వ కాలేజీలు అవసరమని కోరాం.



బలిజ భవన్ పూర్తి చేస్తాం: బలిజ భవన్‌కోసం గతంలోనే చంద్రబాబు స్థలం, తుడా నుంచి నిధులు కేటాయించారు. పునాదులు కూడా వేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పనులు నిలిపివేశారు. బలిజ భవన్ కోసం ప్రభుత్వంతో మాట్లాడి దాతల ద్వారానైనా పూర్తిచేయాలన్న ఆలోచనలో ఉన్నాం.

ఆర్టీసీ మోడల్ బస్టాండు: త్వరలో పునాది వేయనున్నాం. పీపీపీ పద్ధతిలో రూ.550 కోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నిర్మాణం జరగనుంది.





? ఎమ్మెల్యేగారూ.. తిరుపతిలో 'ఫుడ్ కోర్టు' ఏర్పాటు చేస్తామని చెప్పారు. మళ్లీ ఆ ప్రస్తావన రావడం లేదు?

- పార్థసారథి, కొర్లగుంట

! ఈట్ స్ట్రీట్స్ ఏర్పాటుచేసేందుకు కమిషనర్ మౌర్యతో కలసి పలు వీధులు పరిశీలించాం. శ్రీనివాసం సమీపంలో ప్రయోగాత్మకంగా ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నాం. త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తాం.

- ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్యే

నేడు ప్రపంచ జూనోసిస్ డే



ప్రేమ సరే.. జాగ్రత్త సుమా..!

జంతువుల నుంచి వ్యాధులు సోకే ప్రమాదం ● టీకాలు వేయించడంలో అలసత్వం వద్దు

జంతువుల మీద చాలామందికి మక్కువ ఉంటుంది. ప్రేమతో దగ్గరకు చేరదీసి పెంచుతుంటారు. కాలక్షేపం..కాపలా..ఆత్మీయత.. ఒంటరితనం..హోదా...కారణమేదైనా జీవన గమనంలో ఈ మిత్రజీవుల ప్రాధాన్యం పెరిగింది. ఆధునిక సమాజంలో ఇంట్లో ఓ పెంపుడు జంతువు సాధారణమైంది. ఈ జాబితాలో శునకాలదే సింహభాగం. అవగాహనతో వీటిని సాకకపోతే కొన్ని వ్యాధులు సంక్రమించే అవకాశముందని వెటర్నరీ వైద్య నిపుణులు చెబుతున్నారు. జంతువులు, పక్షుల నుంచి మనుషులకు..మన నుంచి పక్షులు, జంతువులకు 150 రకాల హానికర వ్యాధులు(జూనోసిస్) సంక్రమించే ప్రమాదముంది.

- తిరుపతిరూరల్, ఆంధ్రజ్యోతి

వ్యాధులెలా సంక్రమిస్తాయంటే..

జంతువులు కరిచినా, సరిగా ఉడకని మాంసం, పాలు, గుడ్లు, ఇతర ఆహార పదార్థాలు తిన్నా జూనోసిస్ వ్యాధులు సోకుతాయి. సాధారణ జ్వర లక్షణాలతో మొదలై.. ఒక్కోసారి ప్రాణాంతకంగా మారే ప్రమాదమూ ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రేబిస్, లెప్టోస్పైరా, ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్, నిఫా, టీబీ, బర్డ్‌ఫ్లూ తదితరాలు. పశువులు, పందులు, ఎలుకలు, వీధి కుక్కల నుంచి ఈ వ్యాధులు వ్యాపిస్తాయి. బ్యాక్టీరియా, పరాన్న జీవులు, వైరస్‌ల ద్వారా సంక్రమిస్తాయి.

రేబిస్‌తో ప్రాణాలకు ముప్పు

ఎక్కువ మంది ఇళ్లలో కుక్కలను పెంచుతుంటారు. రేబిస్ సోకిన కుక్క లాలాజలం నుంచి మనుషులకు ఆ వ్యాధి సోకుతుంది. వ్యాధి సోకిన మొదటిదశలో జ్వరం, తలనొప్పి, దురద, అనారోగ్యం, ఉద్రేకం, నోటి నుంచి చొంగకారడం, కళ్లల్లో నీరుకారడం, మింగలేకపోవడం, మూర్ఛ తదితర లక్షణాలు కనిపిస్తాయి. రెండో దశలో అపస్మారక స్థితికి చేరుకుని ప్రాణాలు పోయే పరిస్థితి వస్తుంది. మనుషులు, జంతువులను పిచ్చికుక్క కరిచిన వెంటనే గాయాన్ని కార్బాలిక్ సోపు లేదా సబ్బుతో కనీసం పదిసార్లు శుభ్రంగా కడగాలి. వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స అందించాలి. కుక్క కరచిన రోజు నుంచి బాధితుడికి 28రోజుల్లో 5సార్లు టీకాలు వేయించాలి. తర్వాత ఏడాదికోసారి వేయించాలి. 3నెలలు పైబడిన కుక్కలకు టీకాలు తప్పనిసరి. తర్వాత ఏటా క్రమం తప్పకుండా వేయించాలి.

జ్వర లక్షణాలుంటే సంప్రదించండి



నగరాల్లో ఎక్కువమంది కుక్కలను పెంచుకుంటున్నారు. ఆరోగ్యవంతమైన వాటినే కొనుగోలు చేయాలి. మనం తినే ప్రతీది దానికి పెట్టకూడదు. వైద్యులను సంప్రదించి ఆహారం పెట్టాలి. వీటికి కూడా కిడ్నీ, మధుమేహం తదితర సమస్యలు ఉంటాయి. పరిశుభ్రంగా ఉంచాలి. రెండు రోజులపాటు తీవ్రమైన జ్వర లక్షణాలు కనిపిస్తే పరీక్షలు చేయాలి. వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్‌లో కుక్కలు, ఇతర జంతువులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్నాం. అవసరమైతే వైద్యచికిత్స చేస్తున్నాం. ఆస్పత్రిలో స్కానింగ్ లాంటివి కూడా ఉన్నాయి.

- వి.వైకుంఠరావు, వీసీసీహెడ్, ఎస్వీ వెటర్నరీ కళాశాల



నేడు ఉచిత వ్యాక్సిన్ క్యాంపు

తిరుపతి తాతయ్యగుంట వెటర్నరీ కళాశాలలోని నగర పశువైద్య ఆసుపత్రిలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం 9 గంటలకు పెంపుడు జంతువులకు(కుక్కలు, పిల్లులు) ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేయనున్నారు. దీన్ని జంతు ప్రేమికులు సద్వినియోగం చేసుకోవాలని రాలేని వారు సోమ, మంగళవారాల్లో కూడా వచ్చి వ్యాక్సినేషన్ వేయించుకోవచ్చునని సూచించారు.

- పి.జగపతిరామయ్య, అసోసియేట్ డీన్

50 ఎర్రచందనం దుంగల పట్టివేత

● ఓ స్కూటీని ఢీకొనడంతో పట్టుబడ్డ వాహనం


పట్టుబడ్డ ఎర్రచందనం దుంగలు

నాయుడుపేట టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఓ కారులో తరలిస్తున్న 50 ఎర్రచందనం దుంగలను అగ్నిమాపక సిబ్బంది పట్టుకున్నారు. ఈ సంఘటన నాయుడుపేటలో చోటుచేసుకుంది. పెళ్లకూరు మండలం తాళ్వాయిపాడు గ్రామానికి చెందిన శ్రీనివాసులు అగ్నిమాపకశాఖ కార్యాలయం సమీపంలో ఓ ఇంటివద్ద వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం ఉదయం 5 గంటల సమయంలో స్కూటీని అగ్నిమాపకశాఖ కార్యాలయం వద్ద పెడుతుండగా అదే సమయంలో వెంకటగిరి నుంచి చెన్నైకు ఎర్రచందనంతో వెళ్తున్న కారు వేగంగా వచ్చి స్కూటీని ఢీకొంది. అదే సమయంలో శ్రీనివాసులు గాయపడగా స్కూటీ బాగా దెబ్బతింది. పక్కనే ఉన్న అగ్నిమాపక సిబ్బంది కేకలు వేస్తూ శీనయ్య వద్దకు వచ్చి ఆయనను లేపి పక్కన కూర్చొబెట్టే సమయంలో ఎర్రచందనం తరలిస్తున్న వాహనంలో ఉన్న వారు అక్కడ నుంచి వాహనాన్ని వదిలి ఉడాయించారు. అగ్నిమాపక సిబ్బంది ఎర్రచందనం వాహనాన్ని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. గాయపడ్డ శీనయ్యను ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. పట్టుబడ్డ ఎర్రచందనం వాహనానికి ఉన్న నెంబరు తప్పు ఉండటంతో వాహనం ఇంజన్‌కు ఉన్న నెంబరును రోడ్డు రవాణాశాఖ అధికారులకు పంపి కారు యజమాని తెలుసుకునేందుకు అటవీశాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారు. పట్టుబడ్డ ఎర్రచందనం, వాహనంతో కలిపి రూ.10 లక్షలు విలువ ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎర్రచందనాన్ని వెంకటగిరి అటవీశాఖ కార్యాలయానికి తరలించారు.

128 గ్రాముల బంగారాన్ని గదిలో మర్చిపోయిన భక్తులు

● తిరిగి భక్తులకు అప్పగించిన టీటీడీ అధికారులు



తిరుమల, జూలై 5(ఆంధ్రజ్యోతి) : శ్రీవారి దర్శనం కోసం వచ్చి గదిలో మర్చిపోయిన 128 గ్రాముల బంగారు ఆభరణాలను టీటీడీ రిసెప్షన్ అధికారులు తిరిగి భక్తులకు అప్పగించారు.తమిళనాడు రాష్ట్రం మధురై పట్టణానికి చెందిన శివానందన్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం తిరుమలకు వచ్చారు. కాప్రి వకుళామాత గెస్ట్‌లో 5వ నెంబరు గదిని అద్దెకు తీసుకున్నారు. శ్రీవారి దర్శనం ముగించుకుని శనివారం తిరుగుప్రయాణ హడావుడిలో 128 గ్రాముల బంగారు ఆభరణాలను గదిలోనే మర్చిపోయారు. గదిని శుభ్రం చేసేందుకు వెళ్లిన తుకారాం సోమ మందాకర్, వెంకటముని వాటిని గుర్తించి టీటీడీ రిసెప్షన్ అధికారులకు అందజేశారు. ఆభరణాలు మర్చిపోయామని తిరిగి వచ్చిన భక్తుల నుంచి వివరాలు సేకరించిన అనంతరం పద్మావతి విచారణ కార్యాలయం సూపరింటెండెంట్లు కుమారస్వామి, భాస్కరనాయుడు ఆ ఆభరణాలను తిరిగి శివానందన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సుమారు రూ.12 లక్షల విలువైన బంగారు అభరణాలు తిరిగి అప్పగించిన అధికారులకు, సిబ్బందికి శివానందన్ ధన్యవాదాలు తెలిపారు. అలాగే నిజాయితీగా బంగారు ఆభరణాలను అప్పగించిన గెస్ట్‌హౌస్ సిబ్బందిని అధికారులు అభినందించారు.

ట్రేడింగ్ యాప్ పేరుతో మోసం

● రూ.34 లక్షలు పోగొట్టుకున్న ప్రైవేటు ఉద్యోగి

తిరుపతి(నేరవిభాగం), జూలై 5(ఆంధ్రజ్యోతి): ట్రేడింగ్ యాప్‌నకు ఆకర్షితుడై ఒక ప్రైవేటు ఉద్యోగి రూ.34 లక్షలు పోగొట్టుకున్న ఘటన శనివారం తిరుపతి రూరల్‌లో చోటు చేసుకుంది. సీఐ చిన్న గోవిందు వివరాల మేరకు.. తారకరామానగర్‌కు చెందిన వ్యక్తి హైదరాబాదులోని సీసీసీ డిజిటల్ ఇండియా కంపెనీలో టెక్నికల్ ట్రైనర్‌గా పనిచేస్తున్నాడు. ఈ ఏడాది ఏప్రిల్ 23న అతనికి అమెరికన్ సెంచరీ ఇన్వెస్ట్‌మెంటు పేరుతో వాట్సాప్ కాల్ వచ్చింది. తమ ట్రేడింగ్ యాప్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. కొన్ని లింకులు పంపారు. వాటి ద్వారా అతను రూ.34 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశారు. రూ.1.5 కోట్ల లాభాలు వచ్చాయని, ఈ మొత్తాన్ని విత్‌డ్రా చేసేందుకు ఇంకా రూ.28 లక్షలు చెల్లించాలని కోరారు. మోసపోయానని గ్రహించిన బాధితుడు వెంటనే 1930కు ఫోన్ చేసి, ఫిర్యాదు చేశాడు. శనివారం తిరుపతి రూరల్ సీఐను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బస్సు

● ఒకరి మృతి, 15 మందికి గాయాలు

రేణిగుంట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని బస్సు ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. 15 మంది గాయపడ్డారు. అమరరాజా పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగులను పిచ్చాటూరు, నారాయణవనం నుంచి శనివారం ఉదయం విధులకు తీసుకొచ్చే క్రమంలో రెండు బస్సులు పోటీపడ్డాయి. మర్రిగుంట సమీపంలోని నారాయణ కళాశాల వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఒక బస్సు ఢీకొంది. ముందు సీటులో కూర్చుని ఉన్న మహాలక్ష్మి(25) అక్కడికక్కడే మృతి చెందగా బస్సులో ఉన్న 15 మంది ఉద్యోగులు గాయపడ్డారు. పరిశ్రమ నిర్వాహకులు ఘటనా స్థలానికి గాయపడిన వారిని అమరా హాస్పిటల్‌కు తరలించారు. డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్ఐ అరుణ్‌కుమార్ సిబ్బందితో ప్రమాద స్థలికి పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందతున్న క్షతగాత్రులను తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి పరామర్శించారు.


ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ అరుణ కుమార్

పుత్తూరు వార్తలు

ఇరవై ఏళ్ల కల తీరింది సారూ..



తిరుమణ్యంలో మహిళలతో మాట్లాడుతున ఎమ్మెల్యే భానుప్రకాష్

వడమాలపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఇరవై ఏళ్లుగా కలగంటున్న మండలంలోని తిరుమణ్యం- ఎనమలపాళ్యం రోడ్డు సమస్య తీరనుందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. నాబార్డ్ నిధులు రూ.77 లక్షలతో తిరుమణ్యం నుంచి ఎనమలపాళ్యం మధ్య నిర్మించనున్న తారు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు.

పీ4 స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్తాం

పేదల బతుకుల్లో వెలుగులు నింపే పి- 4 స్ఫూర్తిని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే భానుప్రకాష్ పిలుపునిచ్చారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా మండలంలోని తిరుమణ్యంలో ఇంటింటా కరపత్రాలు అందిస్తూ చేసిన అభివృద్ధిని వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మామిడిపై కల్లబొల్లి కబుర్లు చెబుతున్న వైసీపీ నాయకులు ఐదేళ్ల వారి హయాంలో ఏంచేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి డి.సుబ్రమణ్యం రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, నాయకులు ధనంజయులునాయుడు, దాముయాదవ్, మణిరాజు, వెంకటయ్య, పెద్దబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు అర్బన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): పుత్తూరు సబ్ కోర్టునందు శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 293 కేసులను పరిష్కారించి, రూ.2,44,28,593 రికవరీ చేసినట్లు పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సీ రాఘవేంద్ర తెలిపారు. 257 క్రిమినల్ కేసులను, 24 సివిల్ కేసులను, 12 ప్రీవిటి రేషన్ కేసులను పరిష్కరించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జానకి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి రమ్యసాయి లోక్ అదాలత్ బెంచ్ ప్రిసైడింగ్ అధికారులు గా వ్యవహరించారు. బెంచ్ సభ్యులుగా న్యాయవాదులు విజయ్‌కుమార్, లక్ష్మీపతి, బాలాజీ లు వ్యవహరించారు.

అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి

పుత్తూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని ట్రాన్స్‌కో అధికారులకు సీపీఐ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పట్టణ కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ... ఆ ఒప్పందాల వల్ల 25 ఏళ్ల పాటు వినియోగదారుల మీద పెనుభారం పడుతుందన్నారు. ఎన్నికల సమయంలో వాటిని రద్దు చేస్తామని కూటమి నాయకులు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, సర్దుబాటు చార్జీల కారణంగా పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నారని పేర్కొన్నారు. కృష్ణారెడ్డి, రమణ, రవి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



వడమాలపేట, జూలై 5(ఆంధ్ర జ్యోతి): మండలంలోని అప్పలాయ గుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి అలయంలో శని వారం శ్రీవారి గ్రామోత్సవం, ఊం జల సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వేంకటేశ్వరస్వామిని సర్వాభర ణాలు, సుగంధ పరిమళాలు వెదజల్లే పుష్పాలతో అలంకరించి వేదమంత్రాలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ ఊంజల సేవ నిర్వహించారు. అనం తరం సర్వాలంకార భూషితుడై పద్మావతి, అండాల్ సమేత వేంకటేశ్వర స్వామిని మేళతాలాలు, మంగళ వాయిద్యాలు నడుమ ఊరేగించారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

పుత్తూరు టౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మునిరాజా మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చాక 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా విభజించి కార్మికుల కడుపు కొట్టిందన్నారు. అదే విధంగా 12 గంటల పనిదినాన్ని ప్రవేశపెట్టిందన్నారు. విజయ్, దేవరెడ్డి, ధన, నందయ్య, నాగభూషణం, మునికుమారి, విజయకుమారి, అంబికా, పద్మజ, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు సిద్ధం

శ్రీకాళహస్తి, జూలై 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 9న జరగనున్న సార్వత్రిక సమ్మెలో తాము పాలు పంచుకుంటున్నట్లు శ్రీకాళహస్తి లారీ అసోసియేషన్ నాయకులు స్పష్టం చేశారు. లారీ అసోసియేషన్ కార్యాలయం వద్ద శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా రవాణా వ్యవస్థను స్తంభింపజేస్తామని లారీ అసోసియేషన్ నాయకులు అన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ ఆదివారం శ్రీకాళహస్తిలో సీఐటీయూ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీని నిర్వహిస్తామని తెలిపారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

ఏడుగురిపై దాడి కేసు నమోదు

పెళ్లకూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : పునబాక గ్రామానికి చెందిన యాగాని బెన్నీపై అదే గ్రామానికి చెందిన ఏడుగురు దాడి చేసిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. శుక్రవారం గ్రామంలో నెలకొన్న వివాదాల కారణంగా పెళ్లకూరులో ఉన్న బెన్నీపై వెంకటసుబ్బయ్య, నరసయ్య, రాజేష్, యుగంధర్, నిఖిల్, శ్రీనివాస్, సుమన్ దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఎమ్మార్పీఎస్ కమిటీల ఏర్పాటు

చిట్టమూరు, జులై 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు చిట్టమూరు ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి కంటేపల్లి మస్తానయ్య తెలిపారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి వర్ల దేవదాసు మాదిగ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో కమిటీలను ఏర్పాటు చేశారు. తిరుపతి జిల్లా మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, రివి మాదిగ, మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

కోట, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గోవిందపల్లి, కేశవరం గ్రామంలో 3వ రోజు అయిన శనివారం మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లో యువకులు పీర్లు ఎత్తుకొని గుమటాలతో గ్రామోత్సవం నిర్వహించారు. గోవిందపల్లిలో పలువురు భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు.

పలు కేసుల రాజీ

కోట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కోట జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలోని పలు మండలాలకు సంబంధించిన సివిల్, క్రిమినల్ కేసులు నాయుడుపేటలో జరిగిన మెగా లోక్ అదాలత్‌లో రాజీపడినట్లు స్థానిక కోర్టు అధికారులు శనివారం తెలిపారు. కోటలో క్రిమినల్ కేసులు 10, చిట్టమూరులో క్రిమినల్ కేసులు 9, వాకాడులో క్రిమినల్ కేసులు 12 వంతున రాజీపడ్డారు. అదే విధంగా ఎస్‌పిటి 1, డీవీఎస్ 1, మెయింటినెన్స్ కేసు 1, బ్యాంక్ కేసులు 7 వంతున రాజీపడినట్లు వివరించారు. ఆయా కేసులు నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షిసుందరి సమక్షంలో రాజీ అయ్యాయని తెలియ జేశారు.

లోక్ అదాలత్‌లో 5,359 కేసుల పరిష్కారం

నెల్లూరు (లీగల్), జూలై 5 (ఆంధ్ర జ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్‌లో మొత్తం 5,359 కేసులు పరిష్కరించగా, పరిహారం కింద రూ.3,85,45,373లు చెల్లించేలా నిర్ణయించారు. నెల్లూరులో 4,133, కావలిలో 191, ఉదయగిరి 93, అత్మకూరు 153, కోవూరు 198, గూడూరు 204, కోట 47, సూళ్లూరుపేట 98, వెంకటగిరి 122, నాయుడుపేటలో 120 కేసులను పరిష్కరించారు. నెల్లూరులోని జిల్లా కోర్టు భవనం అవరణలో నిర్వహించిన లోక్ అదాలత్‌ను జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్ ప్రారంభించారు.

పంచాయతీ భవనం ప్రారంభం

సూళ్లూరుపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలంలోని ఎన్‌వీకండ్రిగ పంచాయతీ సర్వారెడ్డి కండ్రిగలో రూ.15 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. ఎంపీపీ అల్లూరు అనిల్‌రెడ్డి, సర్పంచ్ ప్రియదర్శిని, టీడీపీ నాయకులు శంకరయ్య, బుజ్జయ్య, కో-ఆప్షన్ సభ్యులు సుకుమార్, ఎంపీడీవో మురళికృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి నుంచే చెత్త సేకరణ

సూళ్లూరుపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇలుపూరు పంచాయతీలో శనివారం ఎంపీడీవో మురళికృష్ణ ఆధ్వర్యంలో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ కార్యక్రమరం చేపట్టారు.

రైతులకు 9 గంటల విద్యుత్

పెళ్లకూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : పంటల సాగుచేస్తున్న రైతులకు 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని ఎస్పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ గురువయ్య అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని కప్పగుంటకండ్రిగ గ్రామంలోని విద్యుత్ ఉప కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈఈ శ్రీనివాసులు, డిప్యూటీ ఈఈ వరప్రసాద్‌రెడ్డి, ఏఈఈ సురేష్‌బాబు, శివశంకర్

సుపరిపాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

చిల్లకూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనను అందించడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని రామారెడ్డిపాళెం గ్రామంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సుపరిపాలన పేరిట ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించడంతోపాటు పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందన్నారు. గాడితప్పిన రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతోందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్‌ను రూ. 4వేలుకు పెంచడంతోపాటు ఒకటో తేదీన లబ్దిదారుల ఇంటికే పెన్షన్ అందిస్తున్నామన్నారు. దీపం పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ సిలిండర్లు, తల్లికివందనం అమలు చేశామన్నారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగులకు నిరుద్యోగభృతి అందిస్తామని వివరించారు. అనంతరం పంచాయతీలో రూ.28 లక్షతో నిర్మించిన సీసీ రోడ్లును, రూ. 40లక్షలతో నిర్మించిన బహుళ ప్రయోజనాల సౌకర్య గోదామును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు రాజశేఖర్ రెడ్డి, నెల్లటూరు చిరంజీవి, గుండాల లీలావతి, పచ్చా వెంకటేశ్వర్లునాయుడు, అన్నం మునిశేఖర్ గౌడ్, నెల్లటూరు సుప్రజ, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పేటేటి చంద్రనీల్, వినయ్‌కుమార్‌రెడ్డి, జానకిరామిరెడ్డి, సతీష్‌రెడ్డి, పిచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే విజయశ్రీ



ఉగ్గుముడిలో సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కనే పరిశీలకులు శివప్రసాద్, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శనివారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని మతకాముడి, ఉగ్గుముడి గ్రామాల్లో పరిశీలికులు జడ్ శివప్రసాద్, టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటా తిరిగి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనుల గురించి వివరించే కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చినమాట ప్రకారం సూపర్ సిక్స్ హామీలు ఒక్కొక్కటిగా నెరు వేరుస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం మాట్లాడుతూ సీఎం చంద్రబాబు గాడి తప్పిన పాలనను గాడిలో పెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొక్కు శంకరయ్య, గాడి నారాయణ రెడ్డి, జక్కా బాలయ్య, శ్రీనివాసుల రెడ్డి, సుబ్రమణ్యం, తిరుపాల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

● ఎస్పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య



మాట్లాడుతున్న ఏపీఎస్‌పిడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య

నాయుడుపేట టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య అన్నారు. నాయుడుపేట విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయంలో శనివారం సాయంత్రం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ అంతరాయాలు, వాటికి గల కారణాలు, అధికలోడ్‌లు, పలు అంశాలపై అధికారులతో చర్చించి పలు సలహాలు, సూచనలు అందజేశారు. వ్యవసాయ సర్వీసులు మంజూరు చేయడంలో నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా ఏర్పాటు చేసే సూర్యశక్తి విద్యుత్‌ను వినియోగించాలని తెలిపారు. పెళ్లకూరు మండలంలోని కేజీ కండ్రిగ 33/11 కేవీ సబ్ స్టేషన్, మేనకూరు 220 కేవీ సబ్ స్టేషన్, నాయుడుపేట మండలం అన్నమేడు 33 కేవీ సబ్ స్టేషన్‌లను టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ శ్రీనివాసులు, ఏడీఈలు వరప్రసాద్‌రెడ్డి, శేఖర్, రవిచంద్ర, ఏఈలు శివశంకర్, హరికృష్ణ, అనిల్, ఏఏవో శ్రీలత పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన



మిట్టవడ్డిపల్లిలో తల్లికి వందనం అందిందా అని ఓ చిన్నారిని అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

డక్కిలి, జులై 5 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శనివారం ఆయన మండలంలోని మిట్టవడ్డిపల్లి, కమ్మపల్లి గ్రామాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో నిర్వహించారు. మొదట మిట్టవడ్డిలో రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన తారు రోడ్డును ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి చూపిస్తానని చెప్పారు. వెంకటగిరి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎండీవో గుణశేఖరరెడ్డి, ఎంఈవో జగదీష్ బాబు, ఎస్ఐ శివశంకర్, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు జన్ని రమణయ్య, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, రాష్ట్ర బ్లయిండ్స్ అసోసియేషన్ అధ్యక్షులు పచ్చూరి నరసయ్య నాయుడు, నాయకులు డక్కిలి చంద్రారెడ్డి, పీపీ చౌదిరి. పోకూరు రమేష్, ఆరికట్ల శ్రీరాములు, దుగ్గి వెంకటేశ్వర్లు, వంశీ పాయసం గోపాల్, పెంచలయ్య, బీజేపీ నాయకులు యోగేశ్వరరావు, గుండాలు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 98 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్ మాట్లాడుతున్న న్యాయమూర్తి సంయుక్త

సూళ్లూరుపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 98 కేసులు పరిష్కారం అయ్యినట్లు న్యాయమూర్తి పి.సంయుక్త తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సమస్యలకు పరిష్కారం ఉంటుందన్నారు. కూర్చోని చర్చించుకుని పరిష్కరించుకుంటే ఎంత పెద్ద సమస్యనైన సులువుగా పరిష్కరించుకోవచ్చునన్నారు. చిన్నపాటి వివాదాలకు కూడా కోర్టులు చుట్టి తిరిగి జీవితాలను నాశనం చేసుకోవద్దనని సూచించారు. సివిల్ క్రిమినల్ 65 కేసులు, బ్యాంకు బీఎస్ఎన్ఎల్ కేసులు 33 మొత్తం 98 కేసులు పరిష్కారం అయ్యాయి. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం కార్యదర్శి ధర్మా ప్రసాదరావు, సీఐ మురళికృష్ణ, న్యాయవాదులు గణపతి, శ్రీరాముల యాదవ్, కొండలరావు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలపై పోలీసుల దాడి

తొమ్మిది ట్రాక్టర్ల సీజ్



రేణిగుంట, జూలై 5, (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ తవ్వకాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. 9 ట్రాక్టర్లను సీజ్ చేశారు. గాజులమండ్యం వీఆర్‌వో విశ్వనాథయ్య ఫిర్యాదు మేరకు పిల్లపాళ్యం గ్రామ సమీపంలోని స్వర్ణముఖి నది పరీవాహక ప్రాంతంలో ఉన్న ప్రైవేటు భూమిలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తుండగా 9 ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామని గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

ఏర్పేడులో స్టీల్ గోల్‌మాల్

● హౌసింగ్ ఏఈపై ఫిర్యాదు

ఏర్పేడు, జూలై 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఏర్పేడు మండలంలో హౌసింగ్ ఏఈగా పనిచేసిన అమర్‌నాథ్ అవినీతిపై నిగ్గు తేల్చాలని ఆ శాఖ అధికారులు రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో రూ.34లక్షల విలువైన స్టీల్ గోల్‌మాల్ జరిగిందని వివరించారు. రికార్డుల తనిఖీలో స్టీల్ తక్కువ వచ్చినట్లు పేర్కొన్నారు. వైసీపీ హయాంలో ఏర్పేడు మండలంలో పనిచేసిన ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్లపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో శ్రీకాళహస్తి హౌసింగ్ డీఈ మోహన్‌రావు, ఏర్పేడు హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ మోహన్ ఉన్నారు.

నేడు కడగుంటలో 'తొలిఅడుగు '

బాలయపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడగుంటలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు సుపరిపాలనలో తొలిఅడుగు జరుగుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు రాయిమస్తాన్‌నాయుడు తెలిపారు.

పీ-4 విధానంతో పేదరికం లేని రాష్ట్రం

వెంకటగిరి, జులై 5 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకు వచ్చిన స్వర్ణాంధ్ర -2047 లక్ష్యాలను చేరుకొనేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర-2047 నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి ప్రసాద్ రావుతో కలిసి ప్రణాళికలు రూపొందించేందుకు నియోజకవర్గ స్థాయి అధికారులకు ఎమ్మెల్యే రామకృష్ణ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఎండీవో గుణశేఖర్‌రెడ్డి, సీఐ రమణ, ఎంపీపీ తనూజారెడ్డి, ఎంపీటీసీలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రసన్న వెంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

కోట, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిట్టేడు, నెల్లూరుపల్లి కొత్తపాళెం, గోవిందపల్లి గ్రామాల్లో ఉన్న ప్రసన్న వెంకటేశ్వర ఆలయాలలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పలు అభిషేకాలు చేసి ప్రత్యేక అలంకారంలో ఉంచారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పాండురంగడికి గ్రామోత్సవం

గూడూరు అర్బన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కటకరాజవీధిలోని రుక్మిణీబాయి సమేత పాండురంగ విఠలనాథస్వామి ఆలయంలో శని వారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను గరుడ వాహనంపై అలంకరించి గ్రామోత్సవం జరిపారు.

లక్ష్మీనరసింహుడికి విశేష పూజలు

చిల్లకూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో కొలువైన లక్ష్మీనరసింహస్వామికి శని వారం ప్రత్యేకపూజలు జరిగాయి. ఉదయం అభిషేకాలు, పూజలు జరిపారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రికి పల్లకీసేవ జరిపారు.

చెంగాళమ్మ హుండీ ఆదాయం రూ.61.71 లక్షలు

సూళ్లూరుపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని శనివారం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో లెక్కించారు. 103 రోజులకుగాను మొత్తం రూ.61,71, 477 నగదు వచ్చింది. 35 గ్రాముల బంగారు, 130 గ్రాముల వెండి, విదేశీ కరెన్సీ యుఎస్ఏ డాలర్స్ 10, సింగపూర్ డాలర్స్ 5, మలేషియా రింగట్స్ 10, సౌదీ రియాల్స్ 1 కానుకల రూపంలో వచ్చాయని సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మీ తెలిపారు. దేవదాయశాఖా అధికారి కె.నవీన్ కుమార్, మెప్మా సిబ్బంది, పోలీసులు, విశ్రాంత బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర



జగన్నాథ, బలదేవ, సుభద్ర విగ్రహాలకు పూజలు చేస్తున్న ఇస్కాన్ ప్రతినిధి



పురవీధుల్లో రథాన్ని లాగుతున్న భక్తులు



కోలాటం ఆడుతున్న భక్తులు

గూడూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం నెల్లూరుకు చెందిన అంతర్జాతీయ శ్రీకృష్ణచైతన్య సంఘం(ఇస్కాన్) ఆధ్వర్యంలో వైభవంగా జగన్నాథ రథయాత్రను నిర్వహించారు. శనివారం సాయంత్రం స్థానిక సొసైటీ కాలనీలోని నారాయణమ్మ గుడి వద్ద నుంచి పూజలు నిర్వహించి రథయాత్రను ప్రారంభించారు. జగన్నాథ, బలదేవ, సుభద్రలను ప్రత్యేకంగా అలంకరించి రథంలో ఉంచి పూజలు చేశారు. రథాన్ని లాగేందుకు భక్తులు అధికసంఖ్యలో హాజరై రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు. రథయాత్ర ముందు కోలాటాలు ఆడుతూ, భజనలు చేస్తూ, నృత్యాలు చేస్తూ, కీర్తనలు ఆలపిస్తూ ముందుకు సాగారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రథయాత్ర సాగే రోడ్లపై భక్తులు పెద్దఎత్తున రంగవల్లులను తీర్చిదిద్దారు. స్థానిక నారాయణమ్మ గుడి నుంచి ఐసీఎస్‌రోడ్డు, కోనేటిమిట్ట, సంగం థియేటర్, గాంధీబొమ్మ, బనిగిసాహెబ్‌పేట, సుందర్‌మహల్ రోడ్డు, రైల్వేస్టేషన్, టవర్‌క్లాక్, రాజావీధి, కుమ్మరవీధుల మీదుగా రథయాత్ర సాగి డీఎస్ఆర్ కమ్యూనిటీహాలుకు చేరుకుని ముగిసింది. పలు కూడళ్లల్లో స్వచ్ఛంద సంస్థలు, భక్తులు ప్రసాదాలు, మంచినీళ్లు, మజ్జిగ ప్యాకెట్లను భక్తులకు అందజేశారు. భక్తుల హరేరామ, హరేకృష్ణ నామ స్మరణలతో పట్టణం మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులతోపాటు పట్టణ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సుపరిపాలనే టీడీపీ ధ్యేయం: ఎమ్మెల్యే సుధీర్


కరపత్రం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, జూలై 5(ఆంధ్రజ్యోతి): సుపరి పాలనే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం శెనగల మిట్ట, పెనుబాకల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా ఇప్పటికే పింఛన్లపెంపు, ఉద్యోగ కల్పన, ఉచిత గ్యాస్ సిలిండర్, తల్లికి వందనం అమలు చేశారన్నారు. ఆగస్టు 15నుంచి మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ పథకం అమలవుతుందన్నారు. చెంచయ్యనాయుడు, కృష్ణయాదవ్, కామేష్‌యాదవ్, వెంకటసుబ్బారెడ్డి, తాటిపర్తి ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

● ప్రజా సంక్షేమం టీడీపీ ధ్యేయమని ఆ పార్టీ తొట్టంబేడు మండల అధ్యక్షుడు రావిళ్ల మునిరాజానాయుడు అన్నారు. బసవయ్యపాళెం పంచాయతీ జ్ఞానాంబకండ్రిగలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. రామానాయుడు, రాజేందర్, వెంటకాచలం, మంగారెడ్డి, ఓబుల్‌రెడ్డి, కమల్‌కుమార్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు కృషితోనే అభివృద్ధి



ఏర్పేడు, జూలై 5(ఆంధ్ర జ్యోతి): మండలంలోని మోదుగుల పాళెంలో శనివారం సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఏర్పేడు మండలంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి నాయకులు పొన్నా రావు, మోహన్‌నాయుడు, మస్తాన్, జయరా మయ్య, గౌరి గిరినాయుడు, బాబునాయుడు, మహేష్‌రెడ్డి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విలీనం వద్దు

కేవీబీపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): తమ పిల్లలు చదివే బడి వారికే కావాలని, తమ పిల్లలను వేరే పాఠశాలలో విలీనం చేయవద్దని శనివారం ఎంఈవో కార్యాలయం వద్ద సుమారు 10 గ్రామాల పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం విలీన ప్రక్రియ జరిగిందన్నారు. అనంతరం విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ర్యాలీగా ఎంపీడీవో కార్యాలయానికి చేరకుని ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరడం ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతులను మదనంబేడు పాఠశాలలో విలీనం చేయడాన్ని నిరసిస్తూ విద్యార్థుల తల్లితండ్రులు సీపీఎం మండల కార్యదర్శి మెలుగు రమేష్ ఆధ్వర్యంలో శనివారం ఎంఆర్సీ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఎంఈవో రవి గ్రామస్తులతో చర్చించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని తెలపడంతో గ్రామస్తులు నిరసన విరమించారు.

మెడికల్ షాపుపై చర్యలు తీసుకుంటాం

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంతి

సత్యవేడు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కాలం చెల్లిన మాత్రలు విక్రయించిన ఎస్ఎస్ నేచురల్ క్యూర్ క్లినిక్ మెడికల్ షాపుపై చర్యలు తీసుకుంటామని శ్రీకాళహస్తి డివిజన్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంతి తెలిపారు. మూడు రోజుల క్రితం మెడికల్ షాపు నిర్వహిస్తున్న ఆర్ఎంపీ ఓ మహిళకు కాలం చెల్లిన మాత్రలు విక్రయించడంపై వార్తలు ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంతి శనివారం విచారణ జరిపారు. క్లినిక్ నిర్వాహకుడు సోమశేఖర్‌ను, బాధిత మహిళ శోభారాణిని వేర్వేరుగా విచారించారు. తదుపరి చర్యల కోసం విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు ప్రశాంతి వివరించారు.

తీర్మానాలను ఎలా మారుస్తారు

● వార్డు సభ్యుల ఆగ్రహం

రేణిగుంట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పాలకవర్గం తీసుకున్న తీర్మానాలను రిజిస్టర్లో నమోదు చేసిన అనంతరం తిరిగి వాటిని ఎలా మారుస్తారని వార్డు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సర్పంచ్ నాగేశం అధ్యక్షతన జరిగిన పంచాయతీ సమావేశంలో ఈ వివాదం చర్చకు వచ్చింది. గత పాలకమండలి తీర్మానించిన అభివృద్ధి పనులను రిజిస్టర్‌లో నమోదు చేసిన తర్వాత వాటిని పక్కనపెట్టి, తిరస్కరించిన పనులను ఎలా నమోదు చేస్తారని కార్యదర్శి మాధవిని, సర్పంచును నిలదీశారు. పాలకవర్గ తీర్మానాలకు విలువ లేకపోతే తామెందుకు సమావేశంలో పాల్గొనాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై వార్డు మెంబర్లు రసూల్, ఇర్ఫాన్, వెంకటరమణ, విజయలక్ష్మి, షానాజ్, మల్లికార్జున్ రెడ్డి, ఖాదర్, మెహబూబ్ భాష, ఇన్నునందన్ తదితరులు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. కాగా వైసీపీ సానుభూతిపరులైన 15 మంది వార్డు సభ్యులు తమ పదవికి రాజీనామా చేస్తున్నట్టు తెలపడం గమనార్హం.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి

సత్యవేడు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని, రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. శనివారం కలెక్టరేట్‌కు చేరుకున్న ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిసి టీపీకోట రోడ్డు విస్తరణ, దాసుకుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణం, అరణియార్ ప్రాజెక్టు ఆధునికీకరణ పనులతో పాటు వంతెనలు, కాజ్‌వేల నిర్మాణాలకు నిధులు కేటాయించాలని కోరారు. అనంతరం జేసీ శుభం భన్సల్‌ను కలిసి రెవెన్యూ సమస్యలపై చర్చించారు.

హుండీ ఆదాయం రూ.7,92,215

శ్రీకాళహస్తి, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండమనాడు కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిఆలయ హుండీ ఆదాయం రూ7,92,215 వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. శనివారం ఆలయ ఆవరణలో హుండీ లెక్కించారు. ఆరు నెలలకు ఈ ఆదాయం వచ్చిందన్నారు.

వేదోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి, జూలై 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న శనీశ్వరుడికి శనివారాన్ని పురస్కరించుకుని వేదోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి, కలశ పూజలను చేశారు. అనంతరం స్వామివారిని నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకించారు. అనంతరం పుష్పాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఐఐటీ సమీపంలో మంటలు

ఏర్పేడు, జూలై 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీ సమీపంలోని కొండపై మంటలు వ్యాపించాయి. అటవీప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు మంట పెట్టినట్టు భావిస్తున్నారు. శనివారం సాయంత్రం 4 నుంచి రాత్రి 7గంటల వరకు మంటలు వ్యాపిస్తూనే ఉన్నాయి. ఆ తరువాత తగ్గుముఖం పట్టయి. మంటలు తగ్గుముఖం పట్టడంతో ఐఐటీ అధికారులు, విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు.

డిప్యూటీ ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

వరదయ్యపాళెం, జూలై 5(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం డిప్యూటీ ఎంపీడీవోగా మధుసూదన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లె పంచాయతీ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. వరదయ్యపాళెం ఈవో బసిరెడ్డి, బత్తలవల్లం పంచాయతీ కార్యదర్శి యూనస్‌ఖాన్ ఆయన్ను సత్కరించారు.

ఉచిత కుట్టు శిక్షణ

వరదయ్యపాళెం, జూలై 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వరదయ్యపాళెం సచివాలయం మిద్దెపై రాష్ట్ర వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ సహకారంతో బీసీ మహిళలకు కుట్టు శిక్షణ ఉచిత శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. కాంబకం, బత్తలవల్లం, వడ్డిపాళెం, కంచరపాళెం, ముస్లింపాళెం, గౌసియానగర్, రామిరెడ్డిపాళెం, అయ్యావారిపాళెం, పద్మావతిపురం, అవంతికాలనీ, ఇందిరానగర్, సంతవేలూరు ప్రాంతాల మహిళలు హాజరయ్యారు.

8న మండల సర్వసభ్య సమావేశం

ఏర్పేడు, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 8వ తేదీ జరగనుంది. మండలస్థాయి అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు, జడ్పీటీసీ సభ్యుడు, ఎంపీపీ, వైస్‌ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరై ప్రజా సమస్యలను తెలపాలని ఎంపీడీవో సౌభాగ్యం కోరారు.

ఆకట్టుకున్న ఉత్తర గోగ్రహణం



కుండపై నిలబెట్టిన కత్తి - అలుగు ఊరేగింపు - బృహన్నల అలంకారం



శ్రీకాళహస్తి, జూలై 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా కొలువై ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉత్తర గోగ్రహణం ఆకట్టుకుంది. విరాట పర్వంలో అర్జునుడు బృహన్నలలా మారడం తెలిసిందే. అందులో భాగంగా ఉత్తర గోగ్రహణం ఘట్టాన్ని వేషధారులు ప్రదర్శించారు. ఇక ఆలయంలో రోజువారి పూజలు కొనసాగాయి. అనంతరం అర్జునుడు బృహన్నల అవతారంలో పట్టణంలో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం తెల్లవారుజామున రెండు గంటలకు కుంభానుగ్రహం(అలుగు) నిర్వహించారు. పురవీధుల గుండా ఊరేగింపు చేసి అనంతరం ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి కత్తిని కుండపై నిలబెట్టి పూజలు చేశారు.


ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు

నేడు అగ్నిగుండ మహోత్సవం

ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి వార్షికోత్సవాల్లో భాగంగా ఈనెల 6న ఆదివారం అగ్నిగుండ మహోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం సాయంత్రం 6గంటలకు అగ్నిగుండ ప్రవేశం ప్రారంభం కానుంది. యేటా సుమారు 4వేల నుంచి 5వేల మంది భక్తులు కంకణాలు ధరించి అగ్నిగుండ ప్రవేశం చేస్తుంటారు. తమ కోర్కెలు తీరుతాయనే నమ్మకంతో భక్తులు పసుపురంగు దుస్తులు ధరించి భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేస్తారు. శ్రీకాళహస్తి మండలం నుంచే కాకుండా సమీప ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలోఈ మహోత్సవానికి తరలి రానున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని భద్రతా ఏర్పాట్లను చేశారు. పోలీసు యంత్రాంగం కూడా కట్టుదిట్టమైన చర్యలను చేపట్టింది.

ట్రాఫిక్ ఆంక్షలు

అగ్నిగుండాన్ని పురస్కరించుకుని ఆదివారం ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నట్లు డీఎస్పీ నరసింహమూర్తి తెలిపారు. ఉదయం 6నుంచి రాత్రి 11 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. ఎంఈఎం సర్కిల్, డిగ్రీ కళాశాల సర్కిల్, వీఎంసీ సర్కిల్ నుంచి ధర్మరాజుల ఆలయం వైపు ఎలాంటి వాహనాలకు అనుమతి లేదన్నారు. పిచ్చాటూరు నుంచి శ్రీకాళహస్తికి వచ్చే ఆర్టీసీ బస్సులు డిగ్రీ కళాశల వరకే నడుస్తాయన్నారు. తడ, బీఎన్ కండ్రిగ మీదుగా శ్రీకాళహస్తికి వచ్చే వాహనాలు ఎంజీఎం ఆస్పత్రి సర్కిల్, ప్రభుత్వాస్పత్రి రోడ్డు మీదుగా బస్టాండుకు చేరుకోవాలన్నారు. వీఎంసీ నుంచి ధర్మరాజస్వామి ఆలయం వైపు కూడా ఎలాంటి వాహనాలకు అనుమతి లేదన్నారు.

లోక్ అదాలత్‌తో ఇరువర్గాలు విజేతలే



మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాస్ నాయక్ - సత్యవేడు కోర్టులో లోక్ అదాలత్

శ్రీకాళహస్తి, జూలై 5(ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లో ఇరువర్గాలు విజేతలేనని 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్‌అదాలత్ తీర్పు సుప్రీంకోర్టు తీర్పుతో సమానమని, అప్పీల్‌కు తావులేదని చెప్పారు. 251 కేసులను పరిష్కరించారు. రూ.23.25 లక్షలను రికవరీ చేశారు. అంతకు ముందు న్యాయమూర్తి మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. న్యాయమూర్తులు బేబీరాణి, శ్రీనివాస్, న్యాయవాదులు, అధికారులు, బ్యాంకు సిబ్బంది, పారాలీగల్ వలంటీర్లు, కోర్టుసిబ్బంది పాల్గొన్నారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): సత్యవేడు జూనియర్ సివిల్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 217 కేసులు పరిష్కరించినట్టు జడ్జి వెంకట నాగరాజ తెలిపారు. 183 క్రిమినల్ కేసులు, 5 సివిల్, 29 పీఎల్‌పీ (బ్యాంకు) కేసులు కేసులను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. ఈ కేసులకు సంబంధించి రూ.56,15,982 రికవరీ చేసినట్లు వెల్లడించారు. బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీస్, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

విధులకు సచివాలయ సిబ్బంది డుమ్మా


సిబ్బంది రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన సచివాలయ సిబ్బంది శనివారం విధులకు డుమ్మా కొట్టారు. బీఎన్‌కండ్రిగ సచివాలయ సిబ్బంది విధులకు హాజకు కాకపోవడంతో అర్జీలు సమర్పించడానికి వచ్చిన గ్రామీణులు చేసేది లేక వెనుదిరిగారు. కార్యదర్శి గత పది రోజుల క్రితం బదిలీపై వెళ్లారు. కొత్త కార్యదర్శి విధుల్లో చేరకపోవడంతో సిబ్బంది విధులకు హాజరు కావడం లేదు. వెల్ఫేర్ అసిస్టెంట్ సెలవు పెట్టడంతో కేవలం మహిళా పోలీసు మాత్రమే విధుల్లో ఉన్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పనితీరు మార్చుకోండి

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల సర్వేయర్లు పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీదేవి హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సర్వేయర్లు ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని ఫిర్యాదులందు తున్నాయన్నారు. దీంతో భూముల సర్వే జరగకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇకపై ఫిర్యాదులొస్తే కలెక్టరేట్‌కు సరెండర్ చేస్తామని తెలిపారు.

సమష్టిగా అభివృద్ధి చేద్దాం



శంకర్‌రెడ్డితో ఎమ్మెల్యే తదితరులు - తుడా చైర్మన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

పిచ్చాటూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. శనివారం తిరుపతికి చేరుకుని తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానిం చారు. అనంతరం సత్యవేడు టీడీపీ ప్రోగాం కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై వారితో చర్చించారు. జడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, టీడీపీ నాయకులు రవిరెడ్డి, వాసురెడ్డి, వినాయగం, జయచంద్రనాయుడు, భక్తారెడ్డి పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో జస్టిస్ సత్యనారాయణమూర్తి



శ్రీకాళహస్తి, జూలై 5(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని శనివారం ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, తిరుమల వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ తొక్కిసలాట ఘటన న్యాయ విచారణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆయన్ను ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా షేక్ సిరాజ్‌బాషా



శ్రీకాళహస్తి,జూలై 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పట్టణానికి చెందిన మైనార్టీ నాయకుడు షేక్ సిరాజ్ బాషాను నియమిస్తూ ఆపార్టీ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది ఈ సం దర్భంగా సిరాజ్‌బాషా మాట్లాడుతూ మాజీ మంత్రి పెద్దిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధు ఆశీస్సులతో తనకు ఈ పదవి వచ్చిం దన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామ న్నారు.

నేడు మలయాళస్వామి ఆరాధన

ఏర్పేడు, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వ్యాసాశ్రమంలో మలయాళ స్వామి ఆరాధన మహోత్సవాలు ఈనెల 6న ఆదివారం నిర్వహించనున్నారు. మలయాళ స్వామి వ్యాసాశ్రమాన్ని స్థాపించి 1962లో పరమపదించారు. ఈ సందర్భంగా యేటా జూలై 6న ఆరాధన మహోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ మహోత్సవంలో ఆశ్రమ పీఠాధిపతులు, స్వాములు, ఆశ్రమ పూర్వ విద్యార్థులు పాల్గొననున్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా! నా కక్షిదారు అయిన పి.కట్టకిందపల్లి గ్రామం, కొత్తూరు పోస్ట్, ఐరాల మండలం మరియు తిరుపతి అర్బన్ మండలం, అక్కారాంపల్లి రోడ్, డి.నెం.20-1-416-ఇ8, సుబాష్ నగర్ నందు నివసించు చింతమాకుల మణిగారి కుమారుడు కార్తిక్ అనువారు క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని తేది. 14.07.2022న డాక్యుమెంట్ నెం.3712/2022 ద్వారా విక్రయము పొంది స్వాధీనంలో ఉన్నారు. సదరు షెడ్యూలు దాఖలా స్థిరాస్తికి సంబంధించిన ఒరిజినల్ మూలాధార పత్రములు నెంబర్లు 909/1998, 707/1998 మరియు 707/1999 అను పత్రములు వారు ఐరాల టౌన్ నందు తేది. 01.09.2022న దారిపోయినందున వారు ఐరాల పోలీసు స్టేషన్ నందు ఇచ్చిన కంప్లైయింట్ మేరకు తేది. 06.09.2022న ధృవీకరణ పత్రము జారీ చేసియున్నారు మరియు నా కక్షిదారు క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని ఎస్.చెంగమ్మ గారికి విక్రయించుటకు ఒప్పుకొన్నందున వారు ఎస్.బి.ఐ. నందు ఋణము పొందుటకు ప్రయత్నించుచున్నారు. కావున సదరు పత్రములు ఎవ్వరికైననూ దొరికిన యెడల మరియు ఏదని అభ్యంతరములు, క్లెయిమ్‌లు వ్యవహారములు ఉన్న యెడల క్రింద కనిన అడ్రసుకు 7 రోజులలోగా తెలుపగలరు.

ఆస్తి షెడ్యూలు: చిత్తూరు డిస్ట్రిక్ట్, శ్రీ బాలాజి రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, తిరుపతి, శ్రీకాళహస్తి సబ్ డిస్ట్రిక్ట్, శ్రీకాళహస్తి మున్సిపాలిటీలోని శ్రీకాళహస్తి టౌన్, బహదూరు పేట, ముత్తరాశి పాళెం 9వ వార్డు, డోర్ నెం.9-305 గల ఇంటికి సమీపమున సర్వే నెం. 128/8 పూరా పుంజ ఎ.1.63 సెం॥లులో ఎ.1.02 సెంట్లు, సర్వే నెం.127/5 పూరా పుంజ ఎ.0.29 సెంట్లు, సర్వే నెం.127/6 పూరా పుంజ ఎ.0.43 సెంట్లు, సర్వే నెం.127/7 పూరా పుంజ ఎ.0.49 సెంట్లులో చేసియుండు (శాంతి నగర్) ప్లాట్లులో 7వ క్రాస్ రోడ్డులో ప్లాటు నెం.6 గల ఖాళీ స్థలమునకు **హద్దులు: ఉత్తరం:** ప్లాటు నెం.5 గల స్థలం, **తూర్పు:** రోడ్డు, **దక్షిణం:** ప్లాటు నెం. 7 గల స్థలం, **పడమర:** మన్నారు దయానంద గారి స్థలం. ఈ హద్దులులలోని తూర్పు-పడమర 50 అ॥లు మార్పు 15.24 మీ॥లు, ఉత్తర - దక్షిణం 25అ॥లు మార్పు 7.62 మీ॥లు వెరశి 1250 చ॥అ॥లు మార్పు 138.88 చ॥గ॥లు మార్పు 116.11 చ.మీ.లు గల ఖాళీ స్థలం మాత్రం

దేశినేని జయచంద్ర, అడ్వకేట్,
డి.నెం.23-15-80/1ఎ, పద్మావతి నగర్, తిరుపతి-517502, సెల్: 9848124167